

గతం కన్నా జిల్లా కొంత మెరుగు

లక్ష్య సాధన 19.69 శాతం

జిల్లా ప్రగతిపై దిశానిర్దేశం చేసిన సీఎం చంద్రబాబు



కలెక్టర్ల సదస్సులో జిల్లా కలెక్టర్ కృతికా శుక్లా



ఎంపీ లావు శ్రీకృష్ణ దేవరాయలు

- 2024-25 పనితీరులో ఏపీ ఎంపీల్లో లావుకు అగ్రస్థానం
- పార్లమెంట్ నివేదికలో వెల్లడి

ప్రశ్నించావు.. ప్రథమంగా నిల్చావు!

నరసరావుపేట, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ నుంచి నరసరావుపేట ఎంపీ నంబరు వన్ పార్లమెంటేరియన్‌గా నిలిచారు. ఈ మేరకు పార్లమెంట్ ప్రతినిధులు ఆదివారం నివేదికను విడుదల చేశారు. పార్లమెంట్‌లో ఆంధ్రప్రదేశ్ ఎంపీల పనితీరుపై సదరు బృందం నివేదికను రూపొందించింది. పార్లమెంట్ సమావేశాలకు హాజరు, ప్రజా సమస్యలపై అడిగిన ప్రశ్నలు, వివిధ అంశాల్లో జరిగిన చర్చల్లో పాల్గొన్న లావు ఏపీకి చెందిన పార్లమెంట్ సభ్యుల్లో ప్రథమ స్థానం పొందారు. 2024-25లో జరిగిన పార్లమెంట్ సమావేశాల్లో శ్రీకృష్ణదేవరాయలు 67 పశ్నలు అడిగారు. లోక్‌సభలో వివిధ అంశాలపై 22 చర్చల్లో ఆయన పాల్గొన్నారు. పార్లమెంట్‌కు ఆయన హాజరు 83.82 శాతంగా నమోదైంది. టీడీపీ పార్లమెంటరీ పార్టీ నేతగా లోక్‌సభలో ఆయన చురుకైన పాత్ర పోషిస్తున్నారు.

పల్నాడు అభివృద్ధికి నిరంతర కృషి

రాష్ట్రానికి రావాల్సిన వివిధ ప్రాజెక్టులపై పార్లమెంట్ సమావేశాల్లో ప్రశ్నించడంతో పాటు వాటిపై కీలకంగా లావు చర్చించారు. అమరావతి రాజధానికి ప్రభుత్వం తరపున నిధుల కోసం లావు కృషి చేస్తున్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలకు వారధిగా నిలుస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వానికి రావాల్సిన ప్రాజెక్టులపై సీఎం చంద్రబాబు సూచించిన విధంగా పార్లమెంట్‌లో వాటి సాధనకు తన వంతు కృషి చేస్తున్నారు. జిల్లాలో జాతీయ రహదారుల నిధుల విడుదలకు కృషి చేశారు. వరికపూడిసెల ప్రాజెక్టుకు పర్యావరణ, అటవీ శాఖల అనుమతులు సాధించడంలో ఆయన కీలకంగా వ్యవహరించారు. పేరేచర్ల - కొండమోడు జాతీయ రహదారి విస్తరణకు నిధుల విడుదల, జిల్లాలో పలు చోట్ల రైల్వే ఆర్‌యూబీల మంజూరు, నాగార్జున సాగర్ పర్యాటక అభివృద్ధికి కేంద్రం నుంచి నిధుల మంజూరు చేయించడంలో లావు విజయ వంతమయ్యారు. జిల్లా ప్రగతి కోసం కేంద్రం నుంచి నిధులు రాబట్టడంలో ఎప్పటికప్పుడు కేంద్ర మంత్రులతో చర్చల ద్వారా సానుకూలత సాధిస్తున్నారు. జిల్లాకు కేంద్ర విద్యాలయాల మంజూరులో ఆయన పాత్ర ఉంది. పార్లమెంట్‌లో నంబర్‌వన్‌గా నిలిచిన లావు శ్రీ కృష్ణదేవరాయలను పలువురు పార్టీ నేతలు అభినందించారు.

దాచేపల్లి మండలంలో అన్యాక్రాంతమైన ప్రభుత్వ భూములు



భూ మాఫియాలో దడ!

- గురజాలలో వైసీపీ నేతల భూ దందా
- 1,600 ఎకరాలు అన్యాక్రాంతమైనట్లు గుర్తింపు
- ఆక్రమణదారులకు నోటీసులు..
- సహకరించిన అప్పటి అధికారులకు కూడా..

పిడుగురాళ్ల, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): భూ ఆక్రమణదారుల గుండెల్లో ఇప్పుడు రైళ్లు పరిగెడుతున్నాయి. తమ అక్రమాలు ఎక్కడ వెలుగులోకి వచ్చి.. కటకటాల పాలవుతామోనని గత ప్రభుత్వంలో చెలరేగిన నేతలు హడలిపోతున్నారు. అధికారుల విచారణతో వారిలో దడ మొదలైంది. గత ప్రభుత్వ హయాంలో కొందరు నేతలు.. గురజాల నియోజకవర్గంలో ప్రభుత్వ, పట్టా భూములనే తేడా లేకుండా.. అన్యాక్రాంతానికి పాల్పడ్డారు. కూటమి ప్రభుత్వం వచ్చాక అనేక మంది రైతులు దీనిపై ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావుకు ఫిర్యాదు చేశారు. ఆ ఫిర్యాదులను జిల్లా కలెక్టర్ దృష్టికి ఎమ్మెల్యే తీసుకెళ్లి భూ దందా వ్యవహారాన్ని నిగ్గు తేల్చాలని పట్టుబట్టారు. దీంతో జిల్లా యంత్రాంగం ఆదేశాల మేరకు స్థానిక రెవెన్యూ అధికారులు రెండు నెలలుగా విచారణ చేపడుతున్నారు. భూ రికార్డుల తనిఖీ, క్షేత్రస్థాయి పరిశీలన చేపట్టారు. పిడుగురాళ్ల, దాచేపల్లి, మాచవరం, గురజాల మండలాల్లో ప్రాథమికంగా 1,600కు పైగా ప్రభుత్వ, పట్టా భూములు గత ప్రభుత్వ హయాంలో నిబంధనలకు విరుద్ధంగా రెవెన్యూ రికార్డుల్లో నమోదైనట్లు గుర్తించారు. గురజాల మండలంలో 293, మాచవరంలో 715, దాచేపల్లిలో 300, పిడుగురాళ్లలో 78 ఎకరాలు ప్రభుత్వ, పట్టా భూములు అన్యాక్రాంతమై.. చేతులు మారినట్లు రెవెన్యూ అధికారులు గుర్తించారు. ఇప్పటికే గురజాల మండలంలో 50 మందికి అధికారులు నోటీసులు జారీ చేశారు. నేడో.. రేపో మిగిలిన మండలాల్లో భూ మాఫియాకు పాల్పడిన వారికి, అప్పట్లో సహకరించిన అధికారులకు నోటీసులు ఇవ్వనున్నారు.

రెవెన్యూ సహకారం..?బ్యాంకుల్లో రుణం!

గురజాల నియోజకవర్గంలో గత ప్రభుత్వ హయాంలో అధికారం అండ, కొందరు రెవెన్యూ అధికారుల సహకారంతో వైసీపీ నేతలు, వారి అనుయాయులు భారీగా భూ ఆక్రమణలకు పాల్పడ్డారు. లేని భూమిని ఉన్నట్టుగా చూపడంతో పాటు రెవెన్యూ రికార్డులను తారుమారు చేశారు. తాము అనుకున్న నేతల పేర్లను ఆ రికార్డులో నమోదు చేయించుకున్నారు. ముఖ్యంగా లేని భూమికి యజమానులుగా పత్రాలు చూపి కొందరు రూ.లక్షల్లో బ్యాంకు రుణాలు కూడా పొందారు. బ్యాంకర్లు కూడా.. 1-బీ, అడంగల్ ఆధారంగా అసలు భూములు ఉన్నాయా.. ? లింకు దస్తావేజులు అడగకుండానే రుణాలిచ్చినట్లు ఆరోపణలున్నాయి. తీసుకున్న రుణం చెల్లించలేకపోతే బ్యాంకుకు తాకట్టుపెట్టిన భూమి ఎక్కడుందో బ్యాంక్ అధికారులకు కూడా తెలియని పరిస్థితి నెలకొంది.

నోటీసులు అందజేస్తున్నాం

- గురజాల ఆర్డీఓ మురళీకృష్ణ



గురజాల నియోజక వర్గంలో ప్రభుత్వ, పట్టా భూముల.. రెవెన్యూ రికార్డులను తారు మారు చేసి, భూ యజమానులుగా నమోదైన వారి వివరాలు గుర్తించినట్లు గురజాల ఆర్డీఓ వి.మురళీకృష్ణ తెలిపారు. భూమికి సంబంధించి ఎలాంటి ఆధారాలు లేకుండా అన్యాక్రాంతం చేసిన వారికి నోటీసులు అందజేస్తున్నట్లు పేర్కొన్నారు. ఉన్నతాధికారుల ఆదేశాలతో ఆ భూములను త్వరలో స్వాధీనం చేసుకుంటామని ఆర్డీవో వెల్లడించారు.

జీడీడీపీ సాధనలో.. 7వ స్థానం

నరసరావుపేట సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): స్థూల ఉత్పత్తి (జీడీడీపీ) సాధనలో జిల్లా రాష్ట్రంలో ఏడవ స్థానంలో నిలిచింది. గతం కన్నా.. పరిస్థితి కొంత మెరుగైంది. 2025 -26 వార్షిక లక్ష్యం రూ.53,488 కోట్లు కాగా రూ.10,530 కోట్లు సాధించింది. ఇంకా రూ.42,958 కోట్లు వచ్చే మార్చి లోగా సాధించాలని ప్రభుత్వం టార్గెట్ ఇచ్చింది. సీఎం చంద్రబాబు నాలుగో కలెక్టర్ల సదస్సులో జిల్లా ఆర్థిక పురోగతిపై సమీక్షించారు. సదస్సులో కలెక్టర్ కృతికా శుక్లా పాల్గొని, జిల్లా ఆర్థిక నివేదికను అందజేశారు. జిల్లా ఆర్థికాభివృద్ధిపై సీఎం కలెక్టర్ కృతికాకు దిశానిర్దేశం చేశారు. నిర్దేశిత లక్ష్యాలను సాధించాలని ఆయన సూచించారు.

స్వర్ణాంధ్ర సూచికలో బీ-గ్రేడు

స్వర్ణాంధ్ర కీలక పనితీరు సూచిక(కేపీఐ)లో జిల్లా 63 పాయింట్లతో బీ-గ్రేడ్‌లో నిలిచింది. స్వర్ణాంధ్ర సూచికలో జిల్లాలోని మండలాలకు టాప్ టెన్‌లో చోటు దక్కలేదు. వ్యవసాయం, అనుబంధ రంగాల పురోభివృద్ధి సమీక్ష జరిగింది. కేపీఐ ప్రకారం జిల్లా 30 స్కోర్‌తో సీ-గ్రేడ్‌లో ఉంది. ఈ రంగానికి సంబంధించి వార్షిక జీవీఏ లక్ష్య సాధనలో జిల్లా 11వ స్థానంలో ఉంది. రూ.19,298 కోట్లు లక్ష్యం కాగా రూ.2,531 కోట్లు ఆదాయం ఆర్జించినట్లుగా నివేదికలో పేర్కొన్నారు. గ్రోత్ రేటును ప్రభుత్వం 15.26 శాతంగా నిర్ణయించింది. రూ.16,767 కోట్లు ఆదాయం సాధించాల్సి ఉంది. పశు సంవర్ధక రంగం ద్వారా రూ.8,756 కోట్లు లక్ష్యంగా నిర్దేశించింది. పరిశ్రమల రంగంలో జీవీఏ జిల్లా లక్ష్యం రూ.10,049 కోట్లు కాగా ఇప్పటి వరకు రూ.2,953 కోట్లు సాధించి.. రాష్ట్రంలో జిల్లా ఏడో స్థానంలో నిలిచింది. సర్వీస్ రంగంలో కేపీఐ 88 మార్కులతో ఏ గ్రేడ్ సాధించింది. ఈ రంగంలో జీవీఏ లక్ష్య సాధనలో 17వ స్థానంలో నిలిచింది. ఆదాయం టార్గెట్ రూ.19,758 కోట్లకు ఇప్పటికి రూ.4,275 కోట్లు సాధించినట్టుగా జిల్లా నివేదికలో పేర్కొన్నారు. ఈ రంగంలో ఇంకా రూ.15,483 కోట్లు ఆర్జించాల్సి ఉంది.

ఆరోగ్యం..మన చేతుల్లోనే..!
- వీధుల్లో చిరుతిండ్లతో అనారోగ్యం
- విజృంభిస్తున్న వైరల్ ఫీవర్లు

గుంటూరులో జాతీయ మీడియా ప్రతినిధులు
- రాష్ట్రంలో మూడు రోజుల పర్యటన ప్రారంభం
- వెంగళాయపాలెం, మిర్చి యార్డుల సందర్శన

డీఎస్సీలో షేక్ మీర్జాకు రాష్ట్రస్థాయిలో 2వ ర్యాంక్
మూడు ఉద్యోగాలకు ఎంపికైన శ్యామల

8

స్మార్ట్ రేషన్ కార్డులు వచ్చాయ్!

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి): స్మార్ట్ రేషన్ కార్డులు జిల్లాకు వచ్చాయి. తహసీల్దారు కార్యాలయాలకు చేరాయి. పాతవాటితో పాటు కొత్త కార్డుల పంపిణీ జిల్లాలో సోమవారం ప్రారంభించారు. వినుకొండలో ప్రభుత్వ చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు, నరసరావుపేటలో ఎమ్మెల్యే చదలవాడ అరవిందబాబు, సత్తెనపల్లి, పెదకూరపాడు, మాచర్ల నియోజకవర్గాల్లో ఆయా ఎమ్మెల్యేలు.. కన్నా లక్ష్మీనారాయణ, భాష్యం ప్రవీణ్, జూలకంటి బ్రహ్మారెడ్డి స్మార్ట్ కార్డుల పంపిణీ చేశారు.

నెలాఖరుకి పంపిణీ పూర్తి..

జిల్లాలో 6,22,791 రేషన్ కార్డులు ఉన్నాయి. కొత్తగా మంజూరైన కార్డులు 5,288, కుటుంబ విభజన చేయడంతో 8,196 కార్డులు పెరగనున్నాయి. వీటితో కార్డుల సంఖ్య 6,36,275కు పెరిగింది. గతంలో ఉన్న కార్డుల్లో కుటుంబ సభ్యుల సంఖ్య కూడా గణనీయంగా పెరిగింది. కొత్త రేషన్ కార్డు కోసం ప్రజలు ఎంతో కాలంగా ఎదురు చూస్తున్నారు. మండలాల వారీగా కార్డులను పంపిణీ చేసేందుకు రెవెన్యూ, పౌరసరఫరాల శాఖలు అన్ని ఏర్పాట్లు చేశాయి. ఈ నెలాఖరు కల్లా పంపిణీ పూర్తి చేసేందుకు కార్యచరణ రూపొందించారు.

పంపిణీ ప్రారంభం



స్మార్ట్ రేషన్ కార్డులు చూపిస్తున్న మహిళలు

దరఖాస్తులు ఇలా..

జిల్లాలో కొత్త కార్డుల కోసం 7,766 కుటుంబాలు దరఖాస్తు చేసుకున్నాయి. వీటిని పరిశీలించిన అధికారులు అందులో 2,478 దరఖాస్తులను అనర్హత కారణంతో తిరస్కరించారు. కార్డుల్లో మార్పులు చేర్పులు కోసం 58,183 దరఖాస్తులు దాఖలయ్యాయి. వివాహం అయిన వారు కుటుంబ విభజన కోసం 8,196 దరఖాస్తులు దాఖలు చేశారు. వీటిని కూడా పరిష్కరించి కొత్త కార్డులు పంపిణీ చేయనున్నారు.

స్మార్ట్‌కార్డుల పంపిణీ ఇలా..

స్మార్ట్ కార్డుల పంపిణీకి ఒక్కొక్క రేషన్ షాపునకు సచివాలయ ఉద్యోగి ఒకరిని నియమించారు. ఈ మేరకు సదరు ఉద్యోగిని మ్యాపింగ్ చేశారు. సదరు ఉద్యోగి జీఎస్‌డబ్ల్యూఎస్ యాప్ ద్వారా స్మార్ట్ కార్డులను పంపిణీ చేస్తారు. ఈ సందర్భంగా కార్డులోని పేర్లలో ఎవరో ఒకరి పేరుతో ఓటీపీ విధానంలో అప్రూవల్ చేస్తారు. కార్డులను పంపిణీ వారం రోజుల్లో పంపిణీ చేసే విధంగా ప్రణాళికను రూపొందించామని జిల్లా సరఫరా అధికారి ఎంవీ ప్రసాద్ తెలిపారు. కొత్తగా మంజూరైన కార్డుదారులకు ఇప్పటికే రైస్ కార్డు నంబర్ జారీ చేశారు. అయితే డీలర్ల వద్ద ఈ-పాస్ మిషన్లకు కొత్త కార్డుల నంబర్లను జత చేయాల్సి ఉంది. ఈ ప్రక్రియ పూర్తయితేనే డీలర్లు కొత్త కార్డుదారులకు రేషన్ పంపిణీ చేస్తారు. కార్డుల పంపిణీని తహసీల్దార్లు, పౌరసరఫరాల శాఖ అధికారులు పర్యవేక్షిస్తున్నారు.



ప్రజా సంక్షేమం కోసం నిరంతరం శ్రమించిన

డాక్టర్ కోడెల

- సత్తెనపల్లి, నరసరావుపేట నియోజకవర్గాల అభివృద్ధికి కృషి
- నేడు 6వ వర్ధంతి కార్యక్రమాల నిర్వహణకు ఏర్పాట్లు

8లో

పోలీస్ వర్గాల్లో.. కలకలం

వైసీపీ హయాంలో పల్నాడులో బరితెగించిన పోలీసులు

- కారుతో ఢీ కొట్టి టీడీపీ నేత జల్లయ్య హత్య
- కేసు విచారణ తారుమారు చేసిన ఇద్దరు సీఐల సస్పెన్షన్
- నిందితులను తప్పించడమే కాదు... హతుని బంధువులే నిందితులుగా కేసు



8

గత వైసీపీ ప్రభుత్వ హయాంలో పల్నాడులో కళంకిత సీఐల సస్పెన్షన్ వ్యవహారం పోలీసు వర్గాల్లో సంచలనం సృష్టించింది. గత వైసీపీ హయాంలో జరిగిన టీడీపీ నేతల హత్యల్లో అత్యధిక ఘటనల్లో ప్రత్యక్షంగానో లేదంటే పరోక్షంగానో పోలీసుల ప్రమేయం ఉందనేది బహిరంగ రహస్యమే. నాడు టీడీపీ నేత జల్లయ్యను వైసీపీ గూండాలు దారుణంగా మతమార్చిన కేసులో పోలీసులు వ్యవహరించిన తీరు పట్ల సర్వత్రా విస్మయం వ్యక్తమవుతోంది. ఈ కేసు విచారణను తారుమారు చేసిన ఇరువురు సీఐలు షమీవుల్లా, జయకుమార్‌లను సస్పెండ్ చేసిన విషయం తెలిసిందే....

ఉత్తమ ఇంజనీర్లుగా ఎదగాలి: వీసీ గంగాధరరావు



సివిల్ ఇంజనీరింగ్ సంఘం లోగో ఆవిష్కరణలో వీసీ తదితరులు

ఏఎన్‌యూ, సెప్టెంబరు15 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు మోక్షగుండం విశ్వేశ్వరయ్యను ఆదర్శంగా తీసుకొని ఉత్తమ ఇంజనీర్లుగా ఎదగాలని ఏఎన్‌యూ తాత్కాలిక ఉపకులపతి ఆచార్య కె.గంగాధరరావు పేర్కొన్నారు. వర్సిటీలోని ఇంజనీరింగ్ కళాశాల సివిల్ విభాగం ఆధ్వర్యంలో సోమవారం ఇంజనీర్ల దినోత్సవం నిర్వహించారు. ముఖ్య అతిథిగా వీసీ ఆచార్య గంగాధరరావు విచ్చేసి, ఇంజనీరు మోక్షగుండం విశ్వేశ్వరయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి, నివాళులర్పించారు. సివిల్ ఇంజనీరింగ్ సంఘం లోగోను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విశ్వేశ్వరయ్య మహారాష్ట్ర, కర్ణాటక రాష్ట్రాలతో పాటు దేశంలోని పలు ప్రాంతాల్లో నాణ్యతతో కూడిన ప్రాజెక్టులు, ఆనకట్టలు నిర్మించారన్నారు. విశిష్ట అతిథి గుంటూరు డివిజన్ పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ విభాగం పూర్వ చీఫ్ ఇంజనీర్ జి.బ్రహ్మయ్య మాట్లాడుతూ సివిల్ ఇంజనీరింగు విద్యార్థులకు కేంద్ర, రాష్ట్ర విభాగాలతో పాటు ప్రైవేట్ సంస్థల్లో ఉద్యోగ అవకాశాలు మెండుగా ఉన్నాయన్నారు. రిజిస్ట్రార్ ఆచార్య జి.సింహాచలం, ప్రిన్సిపాల్ ఆచార్య లింగరాజు, అసిస్టెంట్ ప్రిన్సిపల్ డాక్టర్.డి.చంద్రమౌళి, అసిస్టెంట్ ప్రిన్సిపల్ డాక్టర్ గోపికృష్ణ, డిప్యూటీ ఎగ్జిక్యూటీవ్ ఇంజనీర్ (ఎలక్ట్రికల్) వెంకటేశ్వరరావు ఇంజనీరు విశ్వేశ్వరయ్యసేవలను కొనియాడారు.

ఐసెట్ ప్రవేశాల గడువు పొడిగించాలి

ఏపీ ఐసెట్-2025 ప్రవేశాల గడువును పొడిగించాలంటూ ఏఎన్‌యూ ఏఐఎస్ఎఫ్ శాఖ డిమాండ్ చేసింది. ఐసెట్ ప్రవేశాలకు తక్కువ సమయం ఇవ్వడంపై సోమవారం వర్సిటీలో ఏఐఎస్ఎఫ్ నాయకులు నిరసన వ్యక్తం చేశారు. ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి యశ్వంత్, ఏఎన్‌యూ అధ్యక్షుడు నాసరయ్య మాట్లాడుతూ కన్వీనర్ సెలవు దినాలను పట్టించుకోకుండా ప్రవేశాలు కేటాయించి విద్యార్థులను అయోమయానికి గురి చేశారన్నారు. విద్యార్థులకు ఒకరోజు సమయం ఇవ్వడం అన్యాయమన్నారు. సెలవుల్లో విద్యార్థులు కళాశాలల నుంచి సర్టిఫికెట్లు తెచ్చుకోలేక సీట్లు కోల్పోయే పరిస్థితి ఏర్పడిందన్నారు. ప్రవేశాల ప్రక్రియను కనీసం రెండు రోజులు పొడిగించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో విద్యార్థి నాయకులు పాల్గొన్నారు.

స్మార్ట్ కార్డుతో రాష్ట్రంలో ఎక్కడైనా రేషన్ సౌకర్యం

● స్మార్ట్ రేషన్‌కార్డులు పంపిణీ చేసిన చీఫ్ విప్ జీవీ

వినుకొండ, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): పేదలందరికి ఇళ్ల స్థలాలు పంపిణీ చేసే లక్ష్యంగా ప్రభుత్వం ముందుకు సాగుతోందని ప్రభుత్వ చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు అన్నారు. పట్టణంలోని 12వ వార్డు అంబేడ్కర్ కాలనీలో క్యూఆర్ కోడ్ ద్వారా స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమాన్ని సోమవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ సురేష్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ వినుకొండ పట్టణం, మండలంలో 59 రేషన్ షాపులు ఉన్నాయని, 32,792 మందికి రేషన్ కార్డుదారులకు స్మార్ట్ కార్డులు పంపిణీ చేయనున్నామని తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా ఎక్కడైనా స్మార్ట్ రేషన్ కార్డు ద్వారా బియ్యం పొందవచ్చని తెలిపారు. వైసీపీ పాలనలో రేషన్‌షాపుల ద్వారా ప్రజల సొమ్మును దోచుకున్నారని విమర్శించారు. అవినీతిని అరికట్టి పేదలకు బహుళ ప్రయోజనాలను కల్పించడమే లక్ష్యంగా కోటికిపైగా స్మార్ట్ కార్డుల పంపిణీ కార్యక్రమం చేపట్టడం జరిగిందన్నారు. అనంతరం జీడీసీసీబీ చైర్మన్ మక్కెన మల్లికార్జునరావు మాట్లాడుతూ ప్రజల అవసరాలను గుర్తించి.. హామీలను నెరవేర్చడంలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, యువ నాయకుడు లోకేశ్ ముందుకు సాగుతున్నారన్నారు. స్మార్ట్ కార్డు ద్వారా ప్రభుత్వ పథకాలను పొందేందుకు సులభతరంగా ఉంటుందని తెలిపారు. ఈ సందర్భంగా ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల ప్రత్యేకాధికారి, మెప్మా పీడీ లింగమూర్తి, ఏపీఐడీసీ డైరెక్టర్ పెమ్మసాని నాగేశ్వరరావు, బీజేపీ నాయకుడు మేడం రమేష్, జనసేన నాయకుడు కొంజేటి నాగశ్రీను, జానీ, కౌన్సిలర్ పులి నాగరాజు, లింగా రామయ్య, నరసింహారావు, పత్తి పూర్ణ, టీడీపీ నాయకులు, మహిళలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.



మహిళకు స్మార్ట్‌కార్డు అందజేస్తున్న, జీవీ ఆంజనేయులు

ప్రపంచం విజేతలను మాత్రమే గుర్తిస్తుంది

● శాస్త్రవేత్త డాక్టర్ నాడగౌడ

గుంటూరు (విద్య) సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): ప్రపంచం ఎప్పుడూ విజేతలను మాత్రమే గుర్తిస్తుందని బెంగళూరులోని యూఆర్ రావ్ శాటిలైట్ సెంటర్ ప్రాజెక్ట్ అసోసియేట్ డైరెక్టర్, శాస్త్రవేత్త డాక్టర్ వీఆర్ నాడగౌడ పేర్కొన్నారు. వడ్లమూడి విజ్ఞాన్స్ యూనివర్సిటీలో సోమవారం జరిగిన ఇంజనీర్స్ డే వేడుకల్లో ఆయన పాల్గొని, మాట్లాడారు. అంతరిక్ష సాంకేతికతను నేటితరం యువత అందిపుచ్చుకోవాలని సూచిం చారు. నైపుణ్యాలను పెంపొందించుకుంటూ ముందుకు సాగాలని విజ్ఞప్తి చేశారు. హైదరాబాద్‌లోని స్కైరూట్ ఏరో స్పేస్ వైస్ ప్రెసిడెంట్ డాక్టర్ సీవీఎస్ కిరణ్ మాట్లాడుతూ భారత దేశానికి అవసరమైనది ఉద్యోగాల కోసం వెతికే యువత కాదని, ఉద్యోగాలను సృష్టించే ఇంజనీర్లు అవసరమని అన్నారు. ప్రతిభను వినియోగించి కొత్త పరిశ్రమలు, అవకాశాలను సృష్టించాలన్నారు. ఈ కార్యక్రమంలో విజ్ఞాన్స్ విద్యా సంస్థల చైర్మన్ డాక్టర్ లావు రత్తయ్య, వైస్ చైర్మన్ లావు శ్రీకృష్ణ దేవరాయలు, విజ్ఞాన్స్ యూనివర్సిటీ వైస్ చాన్సలర్ కల్నల్ ప్రొఫెసర్ పి.నాగభూషణ్, సీఈవో డాక్టర్ మేఘన కూరపాటి, విజ్ఞాన్స్ వర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ పీఎంవీ రావు, ఆయా విభాగాల డీన్లు, అధిపతులు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డాక్టర్ వీఆర్ నాడ గౌడ

మద్యం మత్తులో ఘర్షణ..ఒకరి మృతి

యడ్లపాడు, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చెంఘీజ్‌ఖాన్ పేట పంచాయతీ శివారు గ్రామం సంగం గోపాలపురంలో కుటుంబ సభ్యుల మధ్య జరిగిన ఘర్షణలో ఓ వ్యక్తి మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన వేల్పూరి శ్రీనాథ్(36) ఆదివారం సాయంత్రం తన భార్య అక్క కొడుకైన పోట్లూరి విష్ణుతో కలసి మద్యం సేవించాడు. కొద్ది సేపటికి వారి మధ్య మాటామాట పెరిగి ఘర్షణకు దారితీసింది. అదే గ్రామానికి చెందిన మల్లవరపు చందుమణికంఠ, రావూరి విజయ్ అక్కడకు వచ్చి విష్ణుతో కలసి శ్రీనాథ్‌ను విచక్షణా రహితంగా కొట్టారు. దాడి అనంతరం ఇంటికి వెళ్లిన శ్రీనాథ్ చాతిలో నొప్పిగా ఉందని కుటుంబ సభ్యులకు చెప్పారు. వారు వెంటనే యడ్లపాడులోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తీసుకెళ్లగా.. వైద్యులు ప్రాథమిక చికిత్స అందించి.. మెరుగైన వైద్యం కోసం చిలకలూరిపేట ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడి వైద్యులు శ్రీనాథ్‌ను పరీక్షించి అప్పటికే మృతిచెందినట్లు నిర్ధారించారు. మృతుని అన్న సాంబయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ శివరామకృష్ణ తెలిపారు. సోమవారం మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి, కుటుంబ సభ్యులకు అప్పగించినట్లు పేర్కొన్నారు.



మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఎస్ఐ శివరామకృష్ణ

వ్యాయామ ఉపాధ్యాయుడిపై డిప్యూటీ ఈఓ విచారణ

కర్లపాలెం, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చింతాయపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో వ్యాయామ ఉపాధ్యాయుడిగా గతంలో పనిచేసిన మద్దెన గోపీపై విద్యా శాఖ ఆర్జేడీ లింగేశ్వరరెడ్డికి తల్లిదండ్రులు, విద్యార్థులు ఫిర్యాదు చేశారని బాపట్ల జిల్లా ఉప విద్యాశాఖాధికారి కె.సురేష్ సోమవారం తెలిపారు. ఎన్‌సీసీ కార్యక్రమంలో విద్యార్థులకు మంజూరైన దుస్తులు, అలవెన్స్‌లు కాజేయడమే కాక పలు అవకతవకలకు పాల్పడ్డారని ఫిర్యాదులో పేర్కొన్నట్లు తెలిపారు. గోపీపై విచారణకు డీఈవో శ్రీరామ్ పురుషోత్తం ఆదేశాల మేరకు చింతాయపాలెం హైస్కూల్‌లో విచారణ చేపట్టినట్లు వెల్లడించారు. తల్లిదండ్రులను, విద్యార్థులను విచారించామని వాస్తవ రికార్డులను పరిశీలించి పూర్తి నివేదికలను డీఈఓకు అందజేస్తామని సురేష్ విలేకరులకు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంఈవోలు విజయశ్రీ, మనోరంజనీ, ప్రధానోపాధ్యాయులు వేణు మాదవ్ ఉన్నారు. సురేష్ విచారణ జరుపుతున్న సమయంలో పాఠశాల వద్ద ఎస్ఎ ఓసీ ఉపాధ్యక్షురాలు పిట్టు నాగలక్ష్మి, కుమార్తె పాఠశాల బయట ఉండగా.. వెనిగండ్లలో వ్యాయామ ఉపాధ్యాయుడిగా పనిచేస్తూ సస్పెండ్ అయిన పేరం మస్తాన్‌రెడ్డి కొంత మంది విద్యార్థులు, తల్లిదండ్రులతో అక్కడికి చేరుకున్నాడు. ఈ సమయంలో కుమార్తెను ఫొటోలు తీస్తున్న మస్తాన్‌రెడ్డిని ప్రశ్నిస్తే.. దాడికి పాల్పడ్డాడని నాగలక్ష్మి తెలిపింది. దీంతో అతనిపై దాడి చేయాల్సి వచ్చిందని వివరించింది. నాగలక్ష్మి బాపట్ల ఏరియా వైద్యశాలలో చికిత్స కోసం చేరారు. పోలీసులు మస్తాన్‌రెడ్డి అదుపులోకి తీసుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. నాగలక్ష్మి, పేరం మస్తాన్‌రెడ్డి ఫిర్యాదుల మేరకు కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రవీంద్ర తెలిపారు. వెనిగండ్లలో తన సస్పెండ్‌కు కారణమైన గోపీపై ఫిర్యాదు చేసేందుకు తాను వచ్చినట్లు మస్తాన్‌రెడ్డి తెలిపారు.



విచారణ నిర్వహిస్తున్న ఉప విద్యాశాఖాధికారి సురేష్



బాలికను కొడుతున్న మస్తాన్‌రెడ్డి

ఏపీ పీజీ సెట్ కౌన్సెలింగ్ షెడ్యూల్లో స్వల్ప మార్పులు

ఏఎన్‌యూ, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ఉన్నత విద్యా మండలి ఆదేశాల మేరకు ఏపీ పీజీసెట్-2025 కౌన్సెలింగ్ షెడ్యూల్లో స్వల్ప మార్పులు చేసినట్లు ఏపీ పీజీసెట్ ప్రవేశాల కన్వీనర్ ఆచార్య రవికుమార్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. కౌన్సిలింగ్ పేర్ల నమోదు ప్రక్రియ ఈ నెల 17 వరకు, ఆన్‌లైన్ విద్యార్హత సర్టిఫికెట్ల పరిశీలన 18 వరకు కొనసాగుతుందని పేర్కొన్నారు. అభ్యర్థులు వెబ్ ఆప్షన్స్‌ను ఈ నెల 20 లోపు నమోదు చేసుకోవాలని సూచించారు. అభ్యర్థులకు ఈ నెల 22న ప్రవేశాలు కల్పిస్తామని, ఈ నెల 23 నుంచి 25 లోపు సంబంధిత కళాశాలల్లో విద్యార్థులు చేరాలని ఆయన సూచించారు. పీజీ తరగతులు ఈ నెల 23 నుంచి ప్రారంభమవుతాయని తెలిపారు. ఏఎన్‌యూ ఆన్‌లైన్ కౌన్సెలింగ్ కేంద్రంలో క్యాప్, స్పోర్ట్స్, ఎన్ఎస్ఎస్ క్యాటగిరి అభ్యర్థులకు సర్టిఫికెట్ల పరిశీలన పూర్తయిందని వెల్లడించారు. దివ్యాంగుల సర్టిఫికెట్ల పరిశీలన తేదీలను త్వరలో ప్రకటిస్తామని కన్వీనర్ తెలిపారు.

అట్టహాసంగా మన్నవ మోహన కృష్ణ పుట్టినరోజు వేడుకలు

● హాజరైన ప్రజా ప్రతినిధులు, కూటమి ముఖ్యనేతలు

గుంటూరు, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ టెక్నాలజీ సర్వీసెస్ చైర్మన్ మన్నవ మోహనకృష్ణ పుట్టినరోజు వేడుకలు గుంటూరులో అట్టహాసంగా జరిగాయి. మన్నవ మోహనకృష్ణ యూత్ ఆధ్వర్యంలో సోమవారం సాయంత్రం గుంటూరు పశ్చిమ నియోజకవర్గంలోని చేబ్రోలు హనుమయ్య కంపెనీ గ్రౌండ్‌లో నిర్వహించిన పుట్టినరోజు వేడుకలో వేలాది మంది పాల్గొన్నారు. టీడీపీ కార్యకర్తలు, మన్నవ మోహన కృష్ణ అభిమానులు, ఆత్మీయులు భారీ సంఖ్యలోగా పాల్గొన్నారు. మన్నవ మోహన కృష్ణకు గజమాలలతో స్వాగతం పలికారు. యూత్ సభ్యులు, అభిమానుల కేరింతల మధ్య మన్నవ మోహన కృష్ణ భారీ కేక్ కట్ చేశారు. ఈ జన్మదిన వేడుకల్లో పలువురు ప్రముఖులు పాల్గొన్నారు. ఉమ్మడి గుంటూరు జిల్లాలోని ఎమ్మెల్యే గళ్లా మాధవి, చదలవాడ అరవింద్ బాబు, వేగేశ్న నరేంద్ర వర్మ, భాష్యం ప్రవీణ్, మహ్మద్ నసీర్, ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్ర ప్రసాద్, పల్నాడు జిల్లా అధ్యక్షుడు కొమ్మాలపాటి శ్రీధర్, ఏపీఐడీసీ చైర్మన్లు డేగల ప్రభాకర్, గ్రంథాలయ సంస్థ చైర్మన్ గోనుగుంట్ల కోటేశ్వరరావు, వజ్రణం హరిబాబు కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మన్నవ మోహనకృష్ణ మాట్లాడుతూ తన జన్మదినాన్ని ఇంత ఘనంగా నిర్వహించిన తన ఆత్మీయులకు కృతజ్ఞతలు తెలిపారు. వేలాదిగా తరలివచ్చిన ప్రజలకు ధన్యవాదాలు తెలియచేసి, తనను ప్రోత్సహించి, పార్టీలో, ప్రభుత్వంలో తనకు అవకాశం కల్పించిన సీఎం చంద్రబాబు, మంత్రి నారా లోకేశ్‌కు, తనను అనునిత్యం ప్రోత్సహించే నందమూరి బాలకృష్ణకు ధన్యవాదాలు తెలియజేశారు. చంద్రబాబు, లోకేశ్ అడుగుజాడల్లో నడుస్తూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అభివృద్ధికి, తెలుగు దేశం పార్టీకి అంకిత భావంతో సేవలు అందిస్తానని మన్నవ తెలిపారు. మన్నవ మోహన కృష్ణ తన జన్మదినం సందర్భంగా సోమవారం పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. గుంటూరులోని మాతృశ్రీ పిల్లల ఆశ్రమంలో అనాధ పిల్లలకు స్కూల్ యూనిఫాంలు, పుస్తకాలు అందించారు. ఆ తరువాత ఆసుపత్రిలో పండ్లు పంచారు. తరువాత అనురాగ్ ఓల్డేజ్ హోంలో వృద్ధులకు అన్నదానం చేశారు.



ఎమ్మెల్యేలు భాష్యం ప్రవీణ్, అరవిందబాబు, టీడీపీ నేత సుఖవాసితో కలిసి కేక్ కట్ చేస్తున్న మన్నవ



మోహనకృష్ణ జన్మదిన వేడుకల్లో ఎమ్మెల్సీ ఆలపాటి, డేగల

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.60 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్ (కిలో)	139, 150, 157
చికెన్ విత్ స్కిన్(కిలో)	264.00
చికెన్ స్కిన్ లెస్(కిలో)	274.00

27 నుంచి వీణా అవార్డ్స్ నాటిక, నాటక పోటీలు



వివరాలు వెల్లడిస్తున్న సాయి మాధవ్ తదితరులు

తెనాలి అర్బన్, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి) : వీణా అవార్డ్స్-2025 నాటిక, నాటక పోటీలను దసరా సెలవుల్లో ఈ నెల 27 నుంచి ప్రారంభమవుతాయని సినీ రచయిత బుర్రా సాయిమాధవ్ తెలిపారు. స్థానిక సీపీఐ కార్యాలయంలో సోమవారం విలేకర్ల సమావేశం నిర్వహించి, వివరాలు వెల్లడించారు. కళల కాణాచి ఆర్ఎస్ఆర్ గ్రీన్‌వే ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆరు రోజుల పాటు 21 ప్రదర్శనలు ఉంటాయని చెప్పారు. 9 పద్య, ఐదు సాంఘిక నాటకాలు, ఏడు సాంఘిక నాటికలు ప్రదర్శిస్తారని వెల్లడించారు. ఉత్తమ ప్రదర్శనకు ఏఆర్ కృష్ణ జాతీయ పురస్కారం రూ.12,116, బుర్రా సుబ్రహ్మణ్యశాస్త్రి జాతీయ రంగస్థల పురస్కారం రూ.25వేలు, వేద గంగోత్రి వరప్రసాద్ రంగస్థల పురస్కారం 11,116 ప్రదానం చేస్తామని చెప్పారు. పద్య నాటకాల్లో రూ.లక్ష, బంగారు వీణ, రూ.75 వేలు, వెండి వీణ, రూ.50 వేలు, కాంస్య వీణ, సాంఘిక నాటకాలకు రూ.60 వేలు, బంగారు వీణ, రూ.50 వేలు, వెండి వీణ, ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులుగా అందిస్తామన్నారు. ప్రతి నాటకానికి రూ.30-50 వేలు వరకు ప్రదర్శన పారితోషికం ఉంటుందన్నారు. కళల కాణాచి ప్రధాన కార్యదర్శి గోపరాజు విజయ్ మాట్లాడుతూ.. ప్రతిరోజు ఉదయం పద్య నాటకాలు, సాయంత్రం సాంఘిక నాటిక, నాటకాలు ప్రదర్శనలు ప్రదర్శిస్తారని తెలిపారు. చెరుకుమల్లి సింగారావు, వేమూరి విజయభాస్కర్, గోగినేని కేశవరావు, హకీంజాని, భవానీ, మల్లేశ్వరరావు, రమేష్ పాల్గొన్నారు.

శాస్త్ర, సాంకేతిక రంగాల్లో..

రాష్ట్రాన్ని అగ్రస్థానంలో నిలిపేందుకు సీఎం కృషి

● ఏపీ, సైన్స్ అండ్ టెక్నాలజీ అకాడమి చైర్మన్ రవి

గుంటూరు (తూర్పు), సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడి సారథ్యంలో రాష్ట్రాన్ని శాస్త్ర, సాంకేతిక రంగాల్లో అగ్రస్థానంలో నిలిపేందుకు కృషి చేస్తున్నట్లు ఏపీ సైన్స్ అండ్ టెక్నాలజీ అకాడమి చైర్మన్ మందలపు రవి పేర్కొన్నారు. అమెరికాలోని న్యూ జెర్సీలో ప్రవాసాంధ్రులు ఆయనను ఘనంగా సత్కరించారు. ఆయన మాట్లాడుతూ సవాళ్లను, వేగంగా మారుతున్న సాంకేతికతను అందిపుచ్చుకుంటేనే విజేతలుగా నిలుస్తారన్నారు. సభలో పాల్గొన్న మిర్చి యార్డు మాజీ చైర్మన్ మన్నవ సుబ్బారావు, ఇతర వక్తలు మాట్లాడుతూ దేశంలోనే శాస్త్ర, సాంకేతిక రంగాల్లో ఏపీని రవి ముందు వరుసలో ఉంచుతారని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమాన్ని భీమినేని శ్రీనివాస్, శ్రీనాథ్ పర్యవేక్షించగా, చిల్లర శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.



రవిని సత్కరిస్తున్న సుబ్బారావు, ప్రవాసాంధ్రులు

నూతన ఉపాధ్యాయులకు సాదర స్వాగతం

● టీడీపీ పల్నాడు జిల్లా అధ్యక్షుడు కొమ్మాలపాటి

నరసరావుపేట టౌన్, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): నూతన డీఎస్సీ ద్వారా ఎంపికైన ఉపాధ్యాయులకు సాదర స్వాగతం పలుకుతున్నామని టీడీపీ పల్నాడు జిల్లా అధ్యక్షుడు కొమ్మాలపాటి శ్రీధర్ అన్నారు. సోమవారం నరసరావుపేటలోని టీడీపీ జిల్లా కార్యాలయంలో మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కొమ్మాలపాటి మాట్లాడుతూ మాట ప్రకారం డీఎస్సీని పూర్తిచేసిన సీఎం చంద్రబాబునాయుడు, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్‌కు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. తుది జాబితాను మంత్రి నారా లోకేష్ ప్రకటించారన్నారు. సీఎం చంద్రబాబునాయుడు అధికారం చేపట్టిన వెంటనే సచివాలయంలో మెగా డీఎస్సీ ఫైల్‌పై మొదటి సంతకం చేసి.. హామీని నెరవేర్చిన మంచి ప్రభుత్వంగా మరోసారి నిరూపించుకున్నారని కొనియాడారు. 150 రోజుల్లో విద్యా శాఖ అనేక వడిదుడుకులను అధిగమించి మెగా డీఎస్సీ-2025 పూర్తి చేసినందుకు ఎంతో గర్వంగా ఉందన్నారు. తుది జాబితా ఎంపికలో విజయవంతమైన అభ్యర్థులందరికి హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. ఈ సమావేశంలో రాష్ట్ర తెలుగు రైతు అధికార ప్రతినిధి గొట్టిపాటి జనార్దన్‌బాబు, జిల్లా ప్రధాన కార్యదర్శి కొట్టా కిరణ్, జిల్లా తెలుగు యువత అధ్యక్షుడు కోటిరెడ్డి, నాయకుడు దండ అనిల్‌కుమార్, కొంగర రమేష్‌బాబు, వర్ల బాబురావు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కొమ్మాలపాటి


150 రోజుల్లోనే..

డీఎస్సీ ప్రక్రియ లోకేశ్‌కే చెల్లింది : ప్రత్తిపాటి

చిలకలూరిపేట, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): విద్యాశాఖ మంత్రి లోకేశ్ పట్టుదల, పక్కా ప్రణాళికతో వైసీపీ ప్రభుత్వానికి సాధ్యం కాని మెగా డీఎస్సీ అమలు ఆచరణసాధ్యమైందని స్థానిక ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పలు అభ్యంతరాలు 100కు పైగా న్యాయ వివాదాలను అధిగమించి లోకేశ్ కేవలం 150 రోజుల్లోనే డీఎస్సీ ప్రక్రియ పూర్తిచేయడం గొప్ప విషయమని కొనియాడారు. 2014-19లో 18 వేల పోస్టులతో డీఎస్సీ అమలు చేసిన చంద్రబాబు ప్రభుత్వం, నేడు 16,347 పోస్టులతో మెగా డీఎస్సీకి కార్యరూపమిచ్చిందని పేర్కొన్నారు. 1994 నుంచి నేటి వరకు టీడీపీ హయాంలోనే రాష్ట్రంలో సుమారు 2 లక్షల టీచర్ పోస్టులు భర్తీ కావడం చారిత్రాత్మక మైలురాయి అని పేర్కొన్నారు. రాష్ట్ర విద్యారంగాన్ని భ్రష్టుపట్టించిన వైసీపీ ప్రభుత్వ అనాలోచిత విధానాల స్థానంలో లోకేశ్ ప్రవేశపెట్టిన నూతన సంస్కరణలు రాష్ట్ర విద్యా రంగాన్ని జాతీయ స్థాయిలో అందరిని ఆకట్టుకుంటున్నాయని తెలిపారు.

నాగార్జున సాగర్ క్రస్ట్‌గేట్లు మూసివేత

విజయపురిసౌత్, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): ఎగువున ఉన్న శ్రీశైలం ప్రాజెక్ట్ నుంచి నాగార్జున సాగర్ ప్రాజెక్ట్‌కు వరద నీరు తగ్గుముఖం పట్టడంతో ప్రాజెక్ట్ అధికారులు క్రస్ట్‌గేట్లను సోమవారం మూసివేశారు. సాగర్ జలాశయం నీటి మట్టం 587.60 అడుగులు ఉంది. ఇది 305.86 టీఎంసీలకు సమానం. కుడి కాలువ ద్వారా 9,500, ఎడమ కాలువ ద్వారా 4,949, ప్రధాన జల విద్యుత్ కేంద్రం ద్వారా 33,536, ఎస్ఎల్‌బీసీ ద్వారా 2400, ఎల్ఎల్‌సీ ద్వారా 300 క్యూసెక్కులు, మొత్తం ఔట్‌ఫ్లో వాటర్‌గా 50,685 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. శ్రీశైలం నుంచి నాగార్జున సాగర్‌కు 50,685 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతోంది.



మూసివేసిన నాగార్జున సాగర్ క్రస్ట్‌గేట్లు

రేపు జిల్లా స్థాయి వ్యాసరచన, వక్తృత్వ పోటీలు

నరసరావుపేట కల్చరల్,సెప్టెంబరు15 (ఆంధ్రజ్యోతి): జిల్లాస్థాయి వారధి వార్షిక పోటీలు బుధవారం లింగంగుంట్లలోని శంకరాభారతిపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించనున్నట్లు డీఈఓ ఎల్.చంద్రకళ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. డిబేట్, వ్యాస రచనలో ప్రభుత్వ పాఠశాలల 8, 9, 10 తరగతుల విద్యార్థులకు ఈ పోటీలు ఉంటాయని పేర్కొన్నారు. మానసిక ఆరోగ్యం పెరుగుదలపై పాఠశాలల పాత్ర, భారతదేశ పరిస్థితుల దృష్ట్యా ఐక్యరాజ్య సమితి ప్రతిపాదించిన మూడు సుస్థిరాభివృద్ధి లక్ష్యాలు అనే అంశాలపై వ్యాసరచన, అబ్యసన పెంపుదలపై సామాజిక మాధ్యమాల పాత్ర లేదా భారతదేశ అభివృద్ధికి ఐక్యరాజ్య సమితి నిర్దేశించిన లక్ష్యాలు అనే అంశాలపై వక్తృత్వ పోటీలు ఉంటాయని తెలిపారు. పోటీలు ఉదయం 9.30 గంటల ప్రారంభమవుతాయని పేర్కొన్నారు.

మెగా డీఎస్సీ..

మెరిట్ జాబితా వెబ్‌సైట్‌లో..

గుంటూరు (విద్య) సెప్టెంబరు15 (ఆంధ్రజ్యోతి): మెగా డీఎస్సీలో ఉపాధ్యాయులుగా ఎంపికైన అభ్యర్థుల జాబితాను వెబ్‌సైట్‌లో ఉంచినట్లు డీఈఓ సీవీ రేణుక సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. డీఈఓ, కలెక్టరేట్ కార్యాలయంలో జాబితా ప్రదర్శించినట్లు పేర్కొన్నారు. అభ్యర్థులు ఇతర సమాచారం కోసం డీఈవో కార్యాలయంలో హెల్ప్ డెస్క్‌లో సంప్రదించాలని సూచించారు. ఇతర వివరాల కోసం డీఈఓజీఎన్‌టీ బ్లాగ్ స్పాట్.కాంలో చూడాలని సూచించారు.

20న ఎస్‌కేబీఆర్ కళాశాలలో జాబ్ మేళా

మాచర్ల రూరల్, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఎస్‌కేబీఆర్ ప్రభుత్వ కళాశాలలో ఈనెల 20వ తేదీన జాబ్ మేళా నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ లక్ష్మీకుమారి తెలిపారు. సోమవారం ఆమె మాట్లాడుతూ జాబ్ మేళాకు మాస్టర్ మైండ్స్, ఆదిత్య ఆర్గానిక్ ఎకో టెక్నాలజీ, కపిస్టన్ సర్వీసెస్, గోదావరి ఆంధ్ర కోఆపరేటివ్ త్రిఫ్ట్ అండ్ క్రెడిట్ సొసైటీ, ఎంఆర్ఎఫ్ టైర్స్, ఇన్నోవేసోర్స్, టీవీఎస్ బ్యాటరీ, టాటా ఎలక్ట్రానిక్స్, ఎయిర్‌టెల్ పేమెంట్ బ్యాంకు, స్కిల్ క్రాఫ్ట్ ప్రతినిధులు హాజరవుతారన్నారు. నియోజకవర్గ నిరుద్యోగ యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. వివరాలకు సెల్: 7842747682, 9492158153లో సంప్రదించాలన్నారు.

సంక్షిప్తం...

● బెల్లంకొండ, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): డీఎస్సీకి ఎంపికైన అభ్యర్థుల జాబితాను విడుదలచేసి నిరుద్యోగులకు ఇచ్చినమాటను కూటమి ప్రభుత్వం నిలబెట్టుకుందని రాష్ట్ర టీడీపీ మైనార్టీసెల్ ప్రధానకార్యదర్శి మస్తాన్‌షరీఫ్ అన్నారు. బెల్లంకొండ టీడీపీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ సుమారుగా 16వేల టీచర్ల నియామకాలు జరిపిన ఘనత కూటమి ప్రభుత్వానికే సాధ్యమన్నారు. సమావేశంలో టీడీపీమండల నాయకులు గుడిసె కొండయ్య, వెన్నా సీతారామిరెడ్డి,రసూల్, సయ్యద్ జానీ, శ్రీరామ్మూర్తి, జ్యోతి సముద్రం, రజాక్ పాల్గొన్నారు.

● సత్తెనపల్లి: సత్తెనపల్లి నియోజక వర్గంలో 22ఏలో ఉన్న భూముల జాబితా ప్రకటించాలని న్యాయవాది, సామాజిక కార్యకర్త నరిచేటి వేణుగోపాల్ సోమవారం ఒక ప్రకటనలో అధికారులను కోరారు. ప్రైవేట్ భూములను 22ఏ జాబితా నుంచి తొలగించాలన్నారు. దేవదాయ, అటవి, పోరంబోకు భూములను ఆక్రమించి రిజిస్ట్రేషన్ పొందిన భూములను గుర్తించి తిరిగి ప్రభుత్వం స్వాధీనం చే సుకొని ప్రభుత్వ, ప్రజల ఆస్తులను రక్షించాలన్నారు. 22ఏ భూముల ఒరిజనల్ జాబితా తయారు చేసేందుకు ఆక్రమణలు, దొంగ రిజిస్ట్రేషన్‌ల లెక్క తేల్చేందుకు జుడీషియల్ విచారణ నిర్వహించాలన్నారు.

● నకరికల్లు: నకరికల్లు జీడీసీసీబీ అసిస్టెంట్ మేనేజరుగా చేజర్ల దీప్తి బాధ్యతలు స్వీకరించినట్టు బ్రాంచ్ మేనేజర్ ఎం ప్రభాకర్ తెలిపారు. దీప్తికి కార్యాలయ అధికారులు, సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు.

● సత్తెనపల్లి: 12వ పీఆర్‌సీ కమిషన్‌ను ప్రభుత్వం నియమించాలని కోరుతూ సోమవారం ఏపీటీఎఫ్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు మండల పరిషత్ కార్యాలయం నుంచి తాలూకా సెంటర్ వరకు ర్యాలీగా వచ్చి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయ నేతలు మాట్లాడుతూ ఉద్యోగ, ఉపాధ్యాయ విద్యారంగసంస్థల సమస్యలను పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో షేక్ మహమ్మద్ ఇబ్రహీం, మక్కెన శ్రీనివాసరావు, శివారెడ్డి, ఫిరోజ్‌ఖాన్, రవి కుమార్, శ్రీధర్, సత్తెనపల్లి, పెదకూరపాడు నియోజకవర్గాల ఏపీటీఎఫ్ నాయకులు పాల్గొన్నారు.

● అమరావతి: వరికోత యంత్రాల నిర్వాహకులపై పర్యవేక్షణకు ఓ రైతు ఓ వ్యక్తిని పనిలో పెట్టుకంటే అతను సెల్‌ఫోన్, ద్విచక్రవాహనం, పదివేల నగదు అపహరించుకుపోయిన సంఘటన మండలంలోని అత్తలూరులో జరిగింది. అత్తలూరుకి చెందిన బెల్లంకొండ బాలస్వామి సీజన్‌లో వరికోతకు పంజాబ్ నుండి రెండు యంత్రాలను తెచ్చారు. వాటిని పర్యవేక్షణకు రొంపిచర్ల మండలం మునమాకకి చెందిన సూరెడ్డి భార్గవరెడ్డిని పనిలో పెట్టుకున్నారు. ఈ క్ర మంలో భార్గవరెడ్డి సెల్‌ఫోన్, ద్విచక్రవాహనం, నగదు అపహరించుకుని వెళ్లిపోయాడు. దీనిపై బాలస్వామి పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

● రెంటచింతల: సత్రశాలలోని కృష్ణానదిపై నిర్మించిన నాగార్జునసాగర్ టెయిల్‌పాండ్ విద్యుత్‌ప్రాజెక్టులో సోమవారం ఉదయం రెండు యూనిట్ల ద్వారా విద్యుదుత్పత్తిని ప్రారంభించినట్లు ఎస్ఈ కె.వెంకటరమణ చెప్పారు. రిజర్వాయర్‌కు చెందిన 20 రేడియల్ క్రస్ట్ గేట్లలో 1 గేట్ 2 మీటర్లు, 2 గేట్లు 2 మీటర్ల మేర ఎత్తి 24122 క్యూసెక్కులు విద్యుదుత్పత్తి అనంతరం టేల్ రేస్ ఛానల్ ద్వారా 8629 మొత్తంగా 32751 క్యూసెక్కుల నీటిని పులిచింతలకు విడుదల చేస్తున్నామన్నారు. రిజర్వాయర్‌లో 75.50 మీటర్ల మేర నీరుండగా ఈ నీరు 7.080 టీఎంసీలకు సమానమన్నారు. ఎగువన వున్న సాగర్ నుంచి 33180 క్యూసెక్కుల నీరు వస్తుందన్నారు.

● క్రోసూరు: పాడి పశువులకు గాలి కుంటు వ్యాధి టీకా వేయటం ద్వారానే పాలఉత్పత్తి తగ్గుదలను అరికట్టవచ్చునని పశు వైద్యాధికారి షేక్‌బషీర్ అన్నారు. మండలంలోని 88 తాళ్ళూరులో గాలికుంటు వ్యాధి నివారణ టీకాల కార్యక్రమాన్ని సోమవారం సర్పంచ్ ఏసమ్మ ప్రారంభించారు.

● క్రోసూరు ఏఈఎల్‌సీ చర్చిలో సోమవారం నేత్ర వైద్యశిబిరాన్ని నిర్వహించారు. ఎల్‌వీ ప్రసాదు కంటి ఆస్పత్రి సౌజన్యంతో జరిగిన వైద్య శిబిరంలో టెక్నీషియన్ మల్లేష్ వైద్య పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో ఫాస్టర్ మాచర్ల సుందరరావు, విజయ మనోహర్ తదితరులు పాల్గొన్నారు.

● రాజధాని అమరావతి పరిధిలోని ఉద్దండ్రాయునిపాలెంలో ఈనెల 17న జరగనున్న విశ్వకర్మ జయంతి, విశ్వకర్మ యజ్ఞ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని విరాట్ విశ్వకర్మ సంఘం ప్రముఖ్ ఎస్ కామేశ్వరాచారి పిలుపునిచ్చారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్ ముఖ్య అతిథిగా పాల్గొంటారన్నారు. ఈ మేరకు కరపత్రాలను క్రోసూరులో విడుదల చేశారు.

● అమరావతి: కేంద్ర వైద్య కుటుంబ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఈనెల 17వ తేదీ నుండి స్వస్థనారీ సశక్త్ పరివార్ అభిమాన్ వైద్యశిబిరాలు అత్తలూరు పీహెచ్‌సీలో ప్రారంభిస్తున్నారు. అక్టోబరు 2వ తేదీ వరకు జరిగే వైద్యశిబిరాలు రోజుకు ఒక గ్రామంలో బాలికలు, మహిళలకు నిర్వహించి వారికి చికిత్సలు, సూచనలు చేయనున్నారు. కార్యక్రమాన్ని 17న ఉదయం 8గంటలకు అత్తలూరులో ప్రారంభిస్తున్నారు.

● కారంపూడి: రైతులు సాగుచేస్తున్న ప్రతి ఎకరాను ఈ-పంటలో నమోదుచేసుకోవాలని ఏవో నరసింహారావు అన్నారు. సోమవారం మండలంలోని వరి, పత్తి పొలాలను ఆయన పరిశీలించి రైతులకు పలు సూచనలు చేశారు. ఈ-పంట నమోదుకు ఈనెలాఖరు వరకే గడువు ఉందన్నారు. ఈ-పంటలో నమోదైతేనే రైతులకు పంటల బీమా వర్తిస్తుందన్నారు.

● గురజాలటౌన్: గురజాల మండలస్థాయి గ్రీవెన్స్ బుధవారం స్థానిక చల్లగుండ్ల గార్డెన్స్‌లో నిర్వహించనున్నట్లు తహసీల్దార్ దుర్గేశ్వరరావు తెలిపారు.

● విజయపురిసౌత్: ఆల్‌ఇండియా బంజారా సేవా సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షునిగా మాచర్ల మండలం చింతలతండాకు చెందిన రమావత్ భీమానాయక్ ఎన్నికయ్యారు. గుంటూరులోని పోలీస్ కళ్యాణమండపంలో రాష్ట్ర అధ్యక్షుడు చక్రి నాయక్ ఆధ్వర్యాన ఈ ఎన్నిక జరిగింది. జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్‌గా బాణావత్ వెంకటేష్ నాయక్ ఎన్నికయ్యారు.

సూపర్ సిక్స్ సూపర్ హిట్

● స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమంలో కన్నా


రాజుపాలెంలో స్మార్ట్‌కార్డులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే కన్నా

రాజుపాలెం, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): సూపర్ సిక్స్ సూపర్ హిట్ అయిందని ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ అన్నారు. సోమవారం రాజుపాలెం తహసీల్దార్ కార్యాలయంలో టీడీపీ మండల అధ్యక్షులు అంచుల నరసింహరావు అధ్యక్షతన స్మార్ట్ రేషన్‌కార్డు పంపిణీ కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ గత ప్రభుత్వంలో ఆర్థిక వ్యవస్థ చిన్నాభిన్నమైనా ఎంతో అనుభవంతో సూపర్ సిక్స్ హామీలలో 90శాతం అమలు చేశామన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావటంతో ప్రతి గ్రామంలో 25 నుండి 30లక్షల రూపాయల అభివృద్ధి పనులు జరిగాయని చెప్పారు. అనంతరం స్మార్ట్ రేషన్ కార్డులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ సరోజ, నియోజకవర్గ టీడీపీ నాయకులు దరువూరి నాగేశ్వరరావు, జిల్లా పార్టీ అధికారప్రతినిధి పూజల వెంకటకోటయ్య, సాగి శ్రీనివాసరావు, నర్రా బాబురావు, గుత్తా వెంకట్రావు, మర్రి వెంకట్రామిరెడ్డి, పల్లపాటి పెద్దిరాజు, నల్లమోతుల శ్రీనివాసరావు, అంకాళ్ల ప్రభుదాసు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమం కోసం కూటమి ప్రభుత్వం కృషి

సత్తెనపల్లి, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): ప్రజా సంక్షేమమే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం పని చేస్తుందని ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ అన్నారు. పట్టణంలోని 10వ వార్డులో రేషన్ కార్డు లబ్దిదారులకు స్మార్ట్ రేషన్‌కార్డులను ఆయన పంపిణీ చేసి మాట్లాడుతూ ప్రజలందరికీ నిత్యావసరాలు అందేలా ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. సాంకేతికతతో కూడిన స్మార్ట్‌కార్డులను ప్రభుత్వం అందిస్తుందన్నారు. కార్యక్రమంలో ఆర్డీవో రమణాకాంత్‌రెడ్డి, తహసీల్దార్ చక్రవర్తి, నేతలు మస్తాన్‌వలి, నూర్ బాషా జానీ బాబు, కట్టా శంకరరావు పాల్గొన్నారు.

● ముప్పాళ్ళ, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే కన్నా అన్నారు. ముప్పాళ్ళ పీహెచ్‌సీలో నూతనంగా నిర్మించిన బ్లాక్ ప్రైమరీ హెల్త్ యూనిట్ నూతన భవనాన్ని ఆయన ప్రారంభించారు. అనంతరం టీడీపీ సభ్యత్వం ఉన్న మక్కెన ఇన్నయ్య, కామినేని వేణుబాబులు ఇటీవల మరణించటంతో వీరికి ఒక్కొక్కరికి రూ.5లక్షల చెక్కులను వారి కుటుంబాలకు కన్నా అందించారు.

● స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలుపే ధ్యేయంగా పార్టీ నాయకులు, కార్యకర్తలు పనిచేయాలని ఎమ్మెల్యే అన్నారు. ముప్పాళ్ళ సాయిబాబా దేవాలయంలో సోమవారం ముప్పాళ్ళ మండల పార్టీ సమావేశంలో కన్నా మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అందిస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను నాయకులు, కార్యకర్తలు ప్రజలకు వివరించాలన్నారు. కార్యక్రమంలో ముప్పాళ్ళ మండల పార్టీ అధ్యక్షుడు బత్తుల నాగేశ్వరరావు, రావిపాటి నానయ్య, కల్లం వీరభాస్కర్‌రెడ్డి, గోపాలరావు, దరువూరి నాగేశ్వరరావు, పచ్చల నాగేశ్వరరావు, పోతుగంటి నరసింహారావు, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ ప్రారంభం


అమరావతి: స్మార్ట్ రేషన్‌కార్డులు అందజేస్తున్న ఎమ్మెల్యే ప్రవీణ్


పెదకూరపాడు: స్మార్ట్ రేషన్ కార్డులను పంపిణీ చేస్తున్న బ్రహ్మయ్య, ధనలక్ష్మి, రాజు తదితరులు

అమరావతి, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి) రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా ప్రవేశపెట్టిన రేషన్ స్మార్ట్ కార్డులను ధరణికోట 11వ రేషన్ దుకాణం పరిధిలోని లబ్ధిదారులకు ఎంఎల్ఏ భాష్యం ప్రవీణ్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో ప్రవీణ్ మాట్లాడుతూ అమరావతి మండలంలో సుమారు 22వేల రేషన్ కార్డులు పంపిణీ చేస్తామన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ డానియేలు, రేషన్‌డీలర్లు పాల్గొన్నారు.

37,200 స్మార్ట్ కార్డులొచ్చాయ్!

పిడుగురాళ్ల: కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక స్మార్ట్‌కార్డుల పంపిణీకి శ్రీకారంచుట్టింది. పల్నాడు జిల్లాలో సోమవారం నుండి కార్డుదారులకు స్మార్ట్‌కార్డుల పంపిణీచేస్తారు. మండలంలో 37,200 స్మార్ట్‌కార్డులు అందుబాటులోకి వచ్చాయి. పాత బయోమెట్రిక్ మిషన్ స్థానంలో కొత్తవి డీలర్లకు సోమవారమే అందించింది.

దాచేపల్లి మండలంలో 24,180..

దాచేపల్లి: పాత రేషన్‌కార్డుల స్థానంలో కొత్త స్మార్ట్ రేషన్‌కార్డులు వచ్చినట్లు తహసీల్దార్ శ్రీనివాస్‌యాదవ్ సోమవారం తెలిపారు. మండలంలో 45 రేషన్ దుకాణాల్లో 24,180కార్డులు వచ్చినట్టు చెప్పారు. ఇప్పటికే ఆయా గ్రామాల్లో డీలర్ల కు కార్డులు పంపిణీ చేశామన్నారు.

కార్డుదారులందరికీ స్మార్ట్ రేషన్ కార్డులు

నకరికల్లు: రేషన్‌కార్డులున్న వారందరికీ కూటమి ప్రభుత్వం స్మార్ట్‌కార్డులను అందిస్తున్నట్టు తహసీల్దార్ కే పుల్లారావు తెలిపారు. సోమవారం తహసీల్దార్ కార్యాలయానికి 20,416 రేషన్ కార్డులు చేరుకున్నట్టు తెలిపారు.

● అచ్చంపేట: తహసీల్దార్ చంద్రశేఖర్, టీడీపీ నాయకులు స్మార్ట్‌రేషన్‌కార్డులు పంపిణీని ప్రారంభించారు. అచ్చంపేటలోని షాపు నెం.7035లో కార్డులు పంపిణీ ప్రారంభించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ చంద్రశేఖర్ మాట్లాడుతూ మండలంలో 20,477 రేషన్ కార్డులున్నారన్నారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు నందిగం ఆశీర్వాదం, నాయకులు కోటయ్య, సుబ్బారావు, ఆంజనేయులు,అనూపకళ, బుచ్చిబాబు, కృష్ణ పాల్గొన్నారు.

● పెదకూరపాడు: స్మార్ట్‌కార్డుల ద్వారా సేవలందించే లక్ష్యంతో కూటమి ప్రభుత్వం కృషి చేస్తుందని టీడీపీ మండల అధ్యక్షుడు ఏటుకూరి బ్రహ్మయ్య, అర్తిమళ్ళ రమేష్ అన్నారు. పెదకూరపాడులో స్మార్ట్ కార్డులను తహసీల్దార్ ధనలక్ష్మి పర్యవేక్షణలో పంపిణీ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ గుడిపూడి రాజు, గల్లా బాబూరావు, షేక్ ముంతాజ్, డిస్ట్రిబ్యూటరీ కమిటీ చైర్మన్ వడ్లమూడి అప్పారావు, తెలుగు యువత అధ్యక్షులు జి.శివనాగరాజు, తెలుగురైతు జిల్లా ప్రధానకార్యదర్శి బి.ఆంజనేయులు, షేక్‌అజ్మూల్లా, అంద్ర ప్రసాదు, షేక్ షబ్బీర్, మస్తాన్‌షరీఫ్, సుజాత, మలాట్ రఫీ పాల్గొన్నారు.

పేద వర్గాల అభ్యున్నతే ముఖ్యమంత్రి ధ్యేయం

● ఎమ్మెల్యే బ్రహ్మానందరెడ్డి

మాచర్ల, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): పేదవర్గాల అభ్యున్నతే ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ధ్యేయమని ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి అన్నారు. సోమవారం తహసీల్దార్ కార్యాలయంలో నియోజకవర్గ స్థాయి నూతన స్మార్ట్ రైస్‌కార్డుల పంపిణీలో ఆయన పాల్గొన్నారు. నియోజకవర్గ పరిధిలో దాదాపు 98,351 స్మార్ట్‌కార్డుల పంపిణీని ఆయన ప్రారంభించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ క్యూఆర్ కోడ్‌తో స్మార్ట్‌రేషన్ కార్డుల ద్వారా ప్రజా పంపిణీ వ్యవస్థలో పారదర్శకతను తేవొచ్చన్నారు. కార్యక్రమంలో గురజాల ఆర్డీవో మురళీకృష్ణ, తహసీల్దార్లు కిరణ్‌కుమార్, వెంకటేశ్వర్లునాయక్, కరుణకుమార్, రాజశేఖర్, కనకం మేరి, యార్డు చైర్మన్ రాజబోయిన మల్లీశ్వ రి మధుసూదన్ యాదవ్, వడ్డెర కార్పోరేషన్ డైరెక్టర్ కొమెర దుర్గారావు తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబు పర్యటనకు సిద్ధంగా ఉండాలి

నియోజకవర్గంలో సీఎం చంద్రబాబు పర్యటన త్వరలో ఖరారుకానుందని, అందుకు అధికారులు సిద్ధంగా ఉండాలని ఎమ్మెల్యే జూలకంటి అన్నారు. తహసీల్దార్ కార్యాలయంలో గురజాల ఆర్డీవో మురళీ, ఐదు మండలాల రెవెన్యూ, ఇతర అధికారులతో సోమవారం ఆయన సమీక్షించారు. నియోజకవర్గంలో దాదాపు రూ.1350కోట్లతో వరికపూడిశెల, జలజీవన్ మిషన్ వాటర్‌గ్రిడ్, అమృత్‌స్కీం, పట్టణ రోడ్ల విస్తరణపనులకు శంకుస్థాపన ఈ నెలలో జరుగుతుందన్నారు. నియోజకవర్గం, మాచర్లలో అభివృద్ధి ప్రణాళికలు సిద్ధం చేయాలని కోరారు.


స్మార్ట్‌కార్డును పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే బ్రహ్మానందరెడ్డి

ప్రాజెక్టుల రూపశిల్పి విశ్వేశ్వరయ్య

● ఘనంగా ఇంజనీర్స్ డే వేడుకలు


రెంటచింతల: విశ్వేశ్వరయ్య జయంతి వేడుకల్లో ప్రాజెక్టు ఇంజనీర్లు

సత్తెనపల్లి, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించటం ద్వారా ఆధునిక సమాజ నిర్మాణానికి ఇంజనీర్లు కృషి చేస్తున్నారని ఎన్ఎస్‌పీ ఈఈ ఎం మురళీధర్ అన్నారు. సోమవారం ఎన్ఎస్‌పీ కార్యాలయంలో ఇంజనీరింగ్ డేని నిర్వహించారు. గర్వించదగ్గ భారతీయ ఇంజనీరు మోక్షగుండం విశ్వేశ్వరయ్య చిత్రపటానికి పూలమాలలతో నివాళులర్పించారు. పీడబ్ల్యూడీ వర్క్‌షాప్ అండ్ కెనాల్స్ వర్కర్స్ యూనియర్ నాయకులు ఎన్ఎస్‌పీ ఇంజనీర్లకు ఇంజనీరింగ్ డే శుభాకాంక్షలు తెలిపారు. లయన్స్ క్లబ్ పట్టణ శాఖ ఆధ్వర్యంలో ఇంజనీరింగ్‌డే నిర్వహించారు. వివిధ రంగాల్లో ఉత్తమ సేవలు అందించిన ఇంజనీర్లను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ అధ్యక్షుడు బండ్లమూడి వీరాంజనేయులు, కంభాల వెంకటేశ్వరరావు, తవిటి భవన్నారాయణ, పెద్దింటి వెంకటేశ్వర్లు, పొన్నెకంటి కిషోర్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

● రెంటచింతల: మోక్షగుండం విశ్వేశ్వరయ్య జయంతి వేడుకలను టెయిల్‌పాండ్ విద్యుత్ ప్రాజెక్టులో ఘనంగా నిర్వహించారు. తొలుత విశ్వేశ్వరయ్య విగ్రహానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో ప్రాజెక్టు ఎస్ఈ కె.వెంకటరమణ, జీఎం శ్రీనివాస్, ఈఈలు సుబ్రహ్మణ్యం, డీఈలు గిరిబాబు, జయశంకర్, మహ్మద్, మతిన్, సుబ్బారావు, వెంకటరమణ, మల్లేష్, శ్రీలత తదితరులు పాల్గొన్నారు.

చంద్రాజుపాలెం ఫీల్డ్ అసిస్టెంట్ పోస్టు ఎస్సీలకు కేటాయించాలి

బెల్లంకొండ, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): మండలంలోని చంద్రాజుపాలెం ఉపాధి పథకం ఫీల్డ్ అసిస్టెంట్ పోస్టును ఎస్సీలకు కేటాయించాలని గ్రామానికి చెందిన యువకులు గ్రీవెన్స్‌కు అర్జీ అందజేశారు. చంద్రాజుపాలెం రోస్టర్‌పాయింట్ ఎస్సీ ఐతే బీసీలకు కేటాయించారని అర్జీలో వివరించారు. పల్నాడు జిల్లా పీడీ సిద్ధ లింగమూర్తి సోమవారం బెల్లంకొండ వచ్చారు. ఎంపీడీవో కార్యాలయంలో అర్జీదారులు, గ్రామస్తులు మండల టీడీపీ నాయకులతో చర్చించారు. అర్జీదారులు, ప్రస్తుత ఫీల్డ్ అసిస్టెంట్‌ను చర్చించారు. తుది నివేదికను అధికారులకు సిఫార్స్ చేస్తానని పీడీ పేర్కొన్నారు. అంతేగాకుండా ఏపీవోను, టెక్నికల్ అసిస్టెంట్‌లను విచారించారు. సమావేశంలో ఏపీడీ నారాయణ, ఏపీవో మేరీ గ్రిష్, మండల కోర్ కమిటీ సభ్యులు వెన్నా సీతారామిరెడ్డి, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

గిరిజనుల అభివృద్ధే కూటమి ప్రభుత్వ ధ్యేయం

ధారు నాయక్



విజయపురిసౌత్, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): గిరిజనుల అభివృద్దే కూటమి ప్రభుత్వ ధ్యేయమని టీడీపీ ఎస్టీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు ధారునాయక్ అన్నారు. సోమవారం ఆయన మాట్లాడుతూ సీఎం చంద్రబాబునాయుడు గిరిజనుల అభివృద్ధికి కృషి చేస్తున్నారన్నారు. వైసీపీ ప్రభుత్వంలో జగన్‌రెడ్డి గిరిజనులను అణగదొక్కారని విమర్శించారు. గిరిజన యువతకు ఆసరాగా ఉండే విదేశీ విద్యా పథకాన్ని జగన్‌రెడ్డి రద్దు చేస్తే కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఆ పథకాన్ని తిరిగి కొనసాగిస్తూ పరిమితిని పెంచిందన్నారు. 1962 మారుమూల గిరిజన ప్రాంతాలకు రూ.1200 కోట్లతో సీఎం చంద్రబాబు నేతృత్వంలో రోడ్ల నిర్మాణం చేపట్టడం హర్షనీయమన్నారు. గిరిజన ఏజెన్సీ ప్రాంతాల్లో స్థానిక గిరిజనులను ప్రభుత్వ ఉద్యోగాలలో వంద శాతం రిజర్వేషన్ కల్పించేందుకు కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. గత వైసీపీ ప్రభుత్వంలో 16 సంక్షేమ పథకాలను రద్దు చేయడమే కాకుండా కేంద్రం నుంచి వచ్చిన ఎన్ఎస్‌టిఎఫ్‌డీసీ నిధులను దారి మళ్లించి గిరిజనులను మోసం చేశారని ధారు నాయక్ విమర్శించారు.

పాల ఉత్పత్తిదారుల సంక్షేమమే సంగం డెయిరీ లక్ష్యం

● చైర్మన్ ధూళ్ళిపాళ్ళ నరేంద్ర కుమార్

నకరికల్లు, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): పాల ఉత్పత్తిదారుల సంక్షేమమే సంగం డెయిరీ లక్ష్యంగా డెయిరీ పని చేస్తుందని చైర్మన్, పొన్నూరు ఎమ్మెల్యే ధూళ్ళిపాళ్ళ నరేంద్ర కుమార్ అన్నారు. చీమలమర్రి డెయిరీ పాల కేంద్రాన్ని పరిశీలించిన ఆయన రైతులతో మాట్లాడారు. పాడి రైతులకు సబ్సిడీతో కార్పోరేట్ వైద్య సేవలు అందిస్తున్నట్టు తెలిపారు. పాల ఉత్పత్తి దారులకు ప్రతి సంవత్సరం బోనస్ అందిస్తున్నట్టు వివరించారు. ప్రమాద బీమా సౌకర్యాన్ని రైతులకు కల్పిస్తున్నట్టు తెలిపారు. డెయిరీ ద్వారా రైతులు ఆర్థికంగా అభివృద్ధి చెందాలన్నదే తమ సంస్థ లక్ష్యమన్నారు. కార్యక్రమంలో పాల ఉత్పత్తిదారులు పాల్గొన్నారు.


పాడి రైతులతో ఎమ్మెల్యే ధూళ్ళిపాళ్ళ నరేంద్ర కుమార్

తహసీల్దార్ కరుణకుమార్‌ను సన్మానించిన గ్రామస్తులు

దుర్గి, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): తహసీల్దార్ కరుణకుమార్‌ను సోమవారం స్థానిక రెవెన్యూ కార్యాలయంలో గ్రామస్తులు ఘనంగా సన్మానించారు. ప్రజలకు నిత్యం అందుబాటులో ఉంటూ సమస్యలను పరిష్కరించాలని కోరారు. తహసీల్దార్ కరుణకుమార్ మాట్లాడుతూ రెవెన్యూ సమస్యలుంటే నేరుగా తన దృష్టికి తీసుకువస్తే పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. అనంతరం తహసీల్దార్ కరుణకుమార్‌ను దుశ్శాలువలు, పూలమాలలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో యెల్లెబోయిన రమణగోపాల్, ఆకుల శ్రీనివాసరావు, పోలా వెంకట్రామయ్య, బండ్ల చిన మల్లయ్య, యకటీల యేగయ్య తదితరులు పాల్గొన్నారు.


తహసీల్దార్ కరుణకుమార్‌ను సన్మానిస్తున్న గ్రామస్తులు

ఎరువుల నిల్వలను పరిశీలించిన ఏడీఏ


అచ్చంపేట: వేల్పూరులోని దుకాణంలో ఎరువులను పరిశీలిస్తున్న ఏడీఏ పీ మస్తానమ్మ, ఏవో వెంకటేశ్వర్లు

అచ్చంపేట, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): మండలంలోని వేల్పూరులో ఎరువుల దుకాణాణాలను ఏడీఏ పీ మస్తానమ్మ, ఏవో వెంకటేశ్వర్లు సోమవారం తనిఖీ చేశారు. ఎరువుల నిల్వల, స్టాక్ రిజిస్టర్లు పరిశీలించారు. ఎంఆర్‌పీకి మించి ఎరువులను అమ్మరాదని, నిల్వ వివరాలను బోర్డులో ప్రదర్శించాలని తెలిపారు. నిబంధనలు పాటించకపోతే లైసెన్స్‌లు రద్దు చేసి క్రిమినల్ చర్యలకు సిఫార్స్ చేస్తానని డీలర్లను హెచ్చరించారు. ఎరువులు సరిపడా ఉన్నాయన్నారు.

యూరియాను సక్రమంగా సరఫరా చేయాలి

సత్తెనపల్లి, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): రైతులకు అవసరమైన యూరియాను ప్రభుత్వం సక్రమంగా సరఫరా చేయాలని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకుడు మాదంశెట్టి వేదాద్రి కోరారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ పాసు పు స్తకం, ఆధార్‌కార్డు ఉన్నవారికి రెండు కట్టల యూరియాను మాత్రమే ప్ర భుత్వం సరఫరా చేస్తుందన్నారు. రైతులకు తగినంత యూరియాను అందించాలన్నారు. బ్లాక్‌మార్కెట్‌లో యూరి యా అమ్మకాలు నిషేధించాలన్నారు.

నిల్వలలో తేడాలొస్తే క్రిమినల్ కేసులు

నకరికల్లు సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): ఎరువుల నిల్వలకు, రిజిస్టర్‌లో ఉన్న స్టాక్‌కు తేడా వస్తే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని ఏఓ కే దేవదాను హెచ్చరించారు. సోమవారం నకరికల్లులోని డీసీఎంఎస్ స్టాక్ రిజిస్టర్లను, స్టాకును పరిశీలించారు. సొసైటీలోనైనా, ఎరువుల దుకాణాల్లోనైనా, రైతు సేవ కేంద్రాల్లోనైనా మిషనులలోను, రిజిస్టర్లలోనూ, భౌతిక నిల్వలలోను అన్ని ఖచ్చితంగా ఉండాలన్నారు.

మాట నిలబెట్టుకున్న కూటమి ప్రభుత్వం

● ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్



పెదకూరపాడు, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): ఎన్నికలకు ముందు నిరుద్యోగులకు ఇచ్చిన మాటను కూటమి ప్రభుత్వం నిలబెట్టుకుందని ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ అన్నారు. గుంటూరులోని క్యాంపు కార్యాలయంలో సోమవారం ఎమ్మెల్యే మాట్లాడుతూ డీఎస్సీకి ఎంపికైన అభ్యర్థుల జాబితాను ప్రభుత్వం విడుదల చేసిందన్నారు. మంత్రి లోకేశ్ తుది జాబితాను విడుదల చేసి ప్రభుత్వం ఎంత నిబద్ధతతో పనిచేస్తుందో మరోసారి రుజువు చేశారన్నారు. ఒడి దుడుకులను అధిక మించి డీఎస్సీని పూర్తి చేయటం చంద్రబాబు అనుభవానికి నిదర్శనం అన్నారు. ఎంపికైన ఉపాధ్యాయులు చిన్నారుల భవిష్యత్‌ను తీర్చిదిద్దేలా కృషి చేయాలన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారం దిశగా ఎమ్మెల్యే యరపతినేని సమీక్షలు



పిడుగురాళ్ల, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): గురజాల నియోజకవర్గంలో ప్రజాసమస్యల పరిష్కారమే లక్ష్యంగా ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు దృష్టి సారించారు. మండలాల వారీగా అన్నిశాఖల అధికారులతో సమీక్ష నిర్వహించి వీలైనంతవరకు సమస్యలను అక్కడికక్కడే పరిష్కరించేలా అన్ని శాఖల అధికారులతో సమీక్షించనున్నారు. మంగళవారం మాచవరంలో, బుధవారం గురజాలలో నేరుగా సమస్యలు తెలుసుకోనున్నారు.

నేటి నుంచి స్కూల్ గేమ్స్ జిల్లా జట్ల ఎంపిక

సత్తెనపల్లి రూరల్, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): అండర్-19 స్కూల్ గేమ్స్ జిల్లా జట్ల ఎంపికలు ఈనెల 17వ తేదీ నుంచి 22 వరకు వివిధ ప్రాంతాల్లో జరుగుతాయని ఉమ్మడి గుంటూరు జిల్లా అండర్-19 స్కూల్ గేమ్స్ కార్యదర్శి జీ నరసింహారావు సోమవారం ఒక ప్రకటలో తెలిపారు. ఎంపికలకు హాజరయ్యే క్రీడాకారులు జనవరి 1, 2007 తరువాత జన్మించినవారై ఉండాలన్నారు. ఈనెల 17న ఖాజీపాలెంలోని డాక్టర్ టీఎస్ రాజు జూనియర్ కళాశాలలో అథ్లెటిక్స్ సత్తెనపల్లి మండలం నందిగామ హైస్కూల్ ఫుట్‌బాల్, సెపక్‌తక్రా జట్ల ఎంపికలు, 18న కొర్రపాడు జెడ్పీ హైస్కూల్‌లో ఫెన్సింగ్, గుంటూరు బీఆర్ స్టేడియంలో టెన్నిస్, సాఫ్ట్‌టెన్నిస్ జట్ల ఎంపికలు, 19న చిలకలూరిపేటలోని ఏఎంజీ జూనియర్ కళాశాలలో కరాటే, ఏపీఎస్ డబ్ల్యూఆర్ఎస్ జూనియర్ కళాశాల అచ్చంపేటలో రెజ్లింగ్, గ్రెకోరోమన్ జట్ల ఎంపికలు, 20న గుంటూరు బీఆర్ స్టేడియంలో టేబుల్ టెన్నిస్ జట్ల ఎంపికలు, 22న గోరంట్లలోని నెక్స్‌జన్ ఇంటర్నేషనల్ స్కూల్‌లో స్విమ్మింగ్, డైవింగ్ వాటర్, పోలో, మోడరన్ పెంటాదళన్ జిల్లా జట్ల ఎంపిక జరుగుతాయని నరసింహారావు తెలిపారు.

కబడ్డీ జిల్లా జట్టుకు క్రోసూరు మోడల్ స్కూల్ విద్యార్థి ఎంపిక

క్రోసూరు, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): క్రోసూరు మోడల్ స్కూల్ విద్యార్థి ఎస్ శివగోపీకృష్ణ కబడ్డీ అండర్-20 జిల్లా జట్టుకు ఎంపికైనట్టు ప్రిన్సిపల్ మేరీ సుజన్ తెలిపారు. సత్తెనపల్లిలోని అమరావతి హైస్కూల్‌లో జరిగిన సెలక్షన్స్‌లో గోపీకృష్ణ ఎంపికయ్యారన్నారు. రాష్ట్రస్థాయి పోటీల్లో పల్నాడు జిల్లా తరఫున ఆడతాడని ఆమె తెలిపారు. వ్యాయామ ఉపాధ్యాయులు సీహెచ్ నరసింహారావును ఆమె అభినందించారు.

శ్రీసిమెంట్ యాజమాన్యం తీరుపై ఆర్డీవోకి ఫిర్యాదు

కారంపూడి, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఇనుపరాజుపల్లి సమీపంలో శ్రీసిమెంట్ యాజమాన్యం తీరుపై ఇనుపరాజుపల్లి, కాచవరం గ్రామస్తులు సోమవారం టీడీపీ మండల అధ్యక్షుడు గోళ్ల సురేష్ యాదవ్ ఆధ్వర్యాన గురజాల ఆర్డీవో మురళీకృష్ణకు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా సురేష్ యాదవ్ మాట్లాడుతూ శ్రీసిమెంట్ ఫ్యాక్టరీ నిర్మాణం కోసం ఈ గ్రామాల రైతుల సుమారు 1100 ఎకరాల సాగు భూమిని ఇచ్చారని, అర్హులైన రైతుల పిల్లలకు శాశ్వత ఉద్యోగాలు, అర్హత లేనివారికి ఉపాధి అవకాశాలు కల్పిస్తామని యాజమాన్యం హామీ ఇచ్చిందన్నారు. ఫ్యాక్టరీ నిర్మాణం పూర్తయ్యి రెండేళ్లు కావొస్తున్నా స్థానికులకు ఒక్కరికి కూడా శాశ్వత ఉద్యోగ అవకాశం కల్పించకపోగా కాంట్రాక్ట్ పద్ధతిలో పనిచేస్తున్న స్థానికులను తొలగించి ఇతర రాష్ట్రాల వారికి అవకాశం కల్పిస్తున్నారన్నారు. ఇదేమని ప్రశ్నిస్తే నిర్లక్ష్యంగా మాట్లాడుతున్నారన్నారు. ఆర్డీవో మురళీకృష్ణ మాట్లాడుతూ ఫ్యాక్టరీ యాజమాన్యంతో మాట్లాడి న్యాయం చేస్తామన్నారు. వినతిపత్రం అందించిన వారిలో గుర్రపుసాల శ్రీనివాసరావు, చల్లా కొండలు, నున్నా జనార్ధన్, సుబ్బయ్య జీనుగు నాగరాజు, నాగూర్, వెంకయ్య, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

రెండేళ్ళుగా మంచానికే పరిమితం.. పెన్షన్ ఇప్పించండయ్యా


రోళ్ళ కోటేశ్వరరావు

దాచేపల్లి, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): గత రెండేళ్లుగా షుగర్, బీపీ, పక్షవాతంతో బాధపడుతూ కుడి కాలును సగం వరకు పోగొట్టుకొని మంచానికే పరిమితమై జీవనం సాగిస్తున్నానని, తనకు ప్రభుత్వం పింఛన్ అందించి ఆదుకోవాలని గామాలపాడు గ్రామానికి చెందిన రోళ్ళ కోటేశ్వరరావు ప్రభుత్వాన్ని వేడుకుంటున్నాడు. కోటేశ్వరరావుకు భార్య, ముగ్గురు కుమార్తెలు. వ్యవసాయ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. కుటుంబ జీవనం భారంగా ఉండటంతో ప్రభుత్వం తనను ఆదుకోవాల్సిందిగా విజ్ఞప్తి చేస్తున్నాడు.

ఆరోగ్యం.. మన చేతుల్లోనే..!

● కాస్త ఆలోచించి తినండి !
● వీధుల్లో చిరుతిండ్లతో అనారోగ్యం
● విజృంభిస్తున్న వైరల్ ఫీవర్లు

పిడుగురాళ్ల, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): తురకపాలెంలో ఏం జరిగిందో అర్థం కావడం లేదు. నీటి కలుషితమా... వైరల్ ఇన్‌ఫెక్షన్లా.. అనేది కనుగొనేందుకు వైద్యులు సతమతమవుతున్నారు. తురకపాలెంలో జరిగిన వరుస మరణాలతో జిల్లా వైద్య యంత్రాంగం అప్రమత్తమైంది. ఎక్కడా కూడా నీరు కలుషితం కాకుండా జాగ్రత్తలు తీసుకోవడంతో పాటు ప్రజలకు ఆరోగ్య జాగ్రత్తలపై అవగాహన సదస్సులు నిర్వహిస్తూ వస్తోంది. పల్నాడు జిల్లాలోనూ గత కొద్ది రోజులుగా సీజనల్ జ్వరాలతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. తలనొప్పి, జలుబు, జ్వరాలతో ఆసుపత్రులకు వెళ్లే వారి సంఖ్య ఎక్కువగానే ఉంది. ప్రస్తుత వర్షాకాలం వ్యాధులు విజృంభిస్తున్న తరుణంలో ఆహారం విషయంలో ఎంత మాత్రం అలసత్వం వహించినా ఆసుపత్రులపాలై రూ.వేలకు వేలు ఖర్చు చేయాల్సి వస్తుంది. ఎంత ఖర్చు చేసినా ఒక్కోసారి ప్రాణం పోయే పరిస్థితి ఏర్పడుతుంది. మనం తినే ఆహారం పట్ల కొద్ది రోజులు తగు జాగ్రత్తలు పాటించకపోతే ప్రాణాలు పైనే పోతాయన్న వైద్యుల మాటలు ప్రతి ఒక్కరూ విని తీరా వాటిని పాటించి తీరాల్సిందే.



జానపాడు రోడ్డు పక్కన ఫాస్ట్‌ఫుడ్ తింటున్న యువత

అన్నీ రోడ్లపైనే..

ఫాస్ట్‌ఫుడ్, చికెన్ మసాలా, పానీపూరి బండి, చికెన్, మటన్ దుకాణాలు ఎక్కడ చూసినా రోడ్ల పక్కనే కనిపిస్తున్నాయి. వాహనాలు వేగానికి లేచిపడే దుమ్మూధూళి అంతా వాటిపైనే పడిపోతున్నా మూతలు పెట్టకుండా విక్రయించేస్తున్నారు. మాంసం విక్రయించే వ్యక్తి చేతులు అపరిశుభ్రంగా ఉంటే.. బ్యాక్టీరియా సులువుగా ఒకరి నుంచి మరొకరికి చేరి రోగాలు తెచ్చిపెడతాయి. మిఠాయిలోనూ వాడే పలు రకాల రంగులతో ఆరోగ్యానికి హానికరమే. ఏ ఆహార పదార్థాలైనా.. వాటిని జాగ్రత్త చేయడంతోనే ఆరోగ్యం దాగి ఉంటుంది.



మాయబజార్ వీధిలో బండివద్ద పానీపూరీ తింటున్న యువకులు

ఈగలు వాలిన పదార్థాలు తింటే టైఫాయిడ్, విరోచనాలు బారిన పడి విలవిల్లాడే ప్రమాదం ఉంది.

చేతుల శుభ్రత ముఖ్యం..

ప్రతి వ్యక్తి తన ఆరోగ్యం తన చేతుల్లోనే ఉంటుందన్న విషయాన్ని గుర్తుంచుకోవడం లేదు. ఆహార పదార్థాలను తినేముందు.. చేతుల శుభ్రత పాటించకపోతే అతి ప్రమాదకరమైన అతిసార వ్యాధి వ్యాప్తి చెందే అవకాశం ఎక్కువగా ఉంటుంది. అపరిశుభ్రమైన చేతులతో ఆహారం తింటే జలుబు, అతిసారం, హైపటైటిస్-ఏ కంటి సంబంధిత ఇన్‌ఫెక్షన్‌తో బాధపడే అవకాశం ఉంది. మల మూత్ర విసర్జన తర్వాత చేతులు శుభ్రత లేకుండా ఆహారం తింటే మరింత అనారోగ్యానికి గురికావాల్సి వస్తుంది.

నీరు,ఆహారంలో జాగ్రత్త పాటించాలి : డాక్టర్ ఓగూరి కోటయ్య



జూన్ నుంచి అక్టోబరు వరకు సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఎక్కువగా ఉందని సీనియర్ వైద్యులు ఓగూరి కోటయ్య తెలిపారు. ప్రస్తుత సీజన్‌లో ప్రజలు వైరల్ ఫీవర్లతో బాధ పడుతున్నారని.. ఇలాంటి పరిస్థితుల్లో ప్రతి ఒక్కరూ తాగే నీరు, తీసుకునే ఆహారం పట్ల తగు జాగ్రత్తలు పాటించాలని సూచించారు. సీజనల్ వ్యాధులను తట్టుకునేందుకు ఆకు కూరలు, డ్రై ఫ్రూట్స్, గుడ్లు, పాలు, పండ్లు వంటి బలమైన ఆహార పదార్థాలను తీసుకోవాలని సూచించారు.

ర్యాంకుల శ్యామల..

డీఎస్సీ ఫలితాల్లో మూడు ఉద్యోగాలకు ఎంపిక



మారుపూడి శ్యామల

పొన్నూరుటౌన్, సెప్టెంబరు15(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల నిర్వహించిన డీఎస్సీ పరీక్షల్లో పొన్నూరు మండలం చింతలపూడి గ్రామానికి చెందిన మారుపూడి శ్యామల మూడు విభాగాల్లో ఉద్యోగానికి అర్హత సాధించింది. స్కూల్ అసిస్టెంట్ విభాగం బయాలజికల్ సైన్స్‌లో జిల్లాలో 17వ ర్యాంకు, పీజీటీ బోటని విభాగంలో 29వ ర్యాంకు, పీజీటీ బయోలాజికల్ సైన్స్ 59వ ర్యాంకును సాధించింది. ఈడబ్ల్యూఎస్ కోటా కింద బయోలాజికల్ సైన్స్‌లో జిల్లాలో మూడవ ర్యాంకును శ్యామల సాధించింది. ఒకేసారి మూడు ఉద్యోగాలకు ఎంపికైన శ్యామల బయోలాజికల్ సైన్స్ ఉద్యోగాన్ని ఎంపిక చేసుకున్నట్లు తెలిపింది. ఒకేసారి మూడు ఉద్యోగాలు సాధించిన ఆమెను పొన్నూరు వాసులు ప్రత్యేకంగా అభినందిస్తున్నారు.

గురువు నేర్పిన సిలబస్‌తో.. రాష్ట్రస్థాయి 2వ ర్యాంక్



షేక్ మీర్జా

చేబ్రోలు, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): డీఎస్సీలో పీజీటీ(గణితం) పోస్టు కోసం నిర్వహించిన నియామక పరీక్షలో ఉత్తీర్ణత సాధించిన అభ్యర్థుల సెలెక్టెడ్ లిస్ట్‌లో షేక్ మీర్జా బీసీ ఈ కేటగిరిలో రాష్ట్రస్థాయిలో రెండవ ర్యాంక్ సాధించింది. మీర్జా తండ్రి రిటైర్డ్ ఆర్టీసీ డ్రైవర్ కాగా తల్లి గృహిణి, సామాన్య కుటుంబంలో జన్మించి ఈ ఘనత సాధించిన మీర్జాకు అభినందనలు వెల్లువెత్తుతున్నాయి. బీసీ-ఈ కోటాలో జోన్ 3లో మొదటి ర్యాంక్ సాధించిన షేక్ మీర్జా రాష్ట్రంలో బీసీ-ఈ కోటాలో రెండవ స్థానంలో, మొత్తం రాష్ట్ర స్థాయి మెరిట్‌లో 135వ ర్యాంక్‌తో ఉత్తీర్ణత సాధించారు. ఇంగ్లీషు మీడియంలో గణితం సబ్జెక్టుగా పరీక్ష రాసిన వారిలో ఆయన ఈ ఘనత సాధించారు. ఈ సందర్భంగా మీర్జా మట్లాడుతూ తనకు ఇంటర్మీడియట్‌లో విద్యనేర్పిన గురువు చందు పాపారావుని గుర్తు చేసుకున్నారు. తన గురువు నేర్పిన సిలబస్ తన విజయానికి సహాయపడిందని అన్నారు.

నిర్మించారు.. నిర్వహణ మరిచారు..

● నిరుపయోగంగా అగ్రి టెస్టింగ్ ల్యాబ్
● నష్టపోతున్న రైతులు



నిరుపయోగంగా ఉన్న అగ్రి టెస్టింగ్ ల్యాబ్

మాచర్ల రూరల్, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): అన్నీ ఉన్నా అల్లుడి నోట్లో శని అన్న చందాన తయారైంది మాచర్ల నియోజకవర్గ రైతుల పరిస్థితి. రైతులకు నాణ్యమైన విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు అందించేందుకు ఏర్పాటు చేసిన అగ్రి టెస్టింగ్ ల్యాబ్ నిరూపయోగంగా మారింది. దీంతో రైతులు తాము కొనుగోలు చేసిన విత్తనాలు, ఎరువులు, పురుగు మందుల నాణ్యతను పరీక్షించుకునేందుకు జిల్లా కేంద్రానికి వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది.. దీనిపై సరైన అవగాహన లేని రైతులు డీలర్లు ఇచ్చిన విత్తనాలనే వినియోగించి పంటలు సాగు చేయాల్సిన దుస్థితి నెలకొంది.

రూ. 55 లక్షలతో నిర్మాణం


పట్టణంలోని వ్యవసాయ మార్కెట్ యార్డులో 2022లో రూ. 55 లక్షలతో అగ్రి టెస్టింగ్ ల్యాబ్ నిర్మాణం చేపట్టారు. ఈ ల్యాబ్‌లో రైతులు విత్తనాలు, ఎరువులు, పురుగు మందుల నాణ్యతను పరీక్షించుకొని వినియోగించుకోవచ్చు. అధునాతన హంగులతో భవన నిర్మాణం కూడా పూర్తయింది. 2023లో అట్టహాసంగా ప్రారంభించారు. అయితే భవనంలో అవసరమైన హాట్ ఎయిర్ ఓవెన్, అనలిటికల్ బ్యాలెన్స్ వాక్యూమ్ పంపు, వాటర్ బాత్ షేకర్ వంటి సామగ్రిని ఏర్పాటు చేయలేదు. సిబ్బంది నియామకం కూడా జరపలేదు. దీంతో రెండేళ్లుగా ఈ అగ్రి టెస్టింగ్ ల్యాబ్ రైతులకు అందుబాటులోకి రాలేదు. రైతుల అభివృద్ధికి పెద్దపీట వేసే కూటమి ప్రభుత్వం దీనిపై దృష్టి సారించి ల్యాబ్‌ను అందుబాటులోకి తీసుకురావాలని రైతులు కోరుతున్నారు.

పరికరాలు అందుబాటులోకి రాగానే...

అగ్రి టెస్టింగ్ ల్యాబ్ నిర్వహణకు అవసరమైన సామగ్రి అందుబాటులోకి రాలేదు. అవి రాగానే ల్యాబ్‌ను నిర్వహిస్తాం. పరికరాలు లేకపోవడం వల్ల నాణ్యతా పరీక్షలు ప్రారంభం కాలేదు. ల్యాబ్‌లో సామగ్రి ఏర్పాటు చేయాలని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం.

పోలీస్ వర్గాల్లో.. కలకలం

● వైసీపీ హయాంలో పల్నాడులో బరితెగించిన పోలీసులు
● కారుతో ఢీ కొట్టి టీడీపీ నేత జల్లయ్య హత్య
● కేసు విచారణ తారుమారు చేసిన ఇద్దరు సీఐల సస్పెన్షన్
● నిందితులను తప్పించడమే కాదు... హతుని బంధువులే నిందితులుగా కేసు



గుంటూరు, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి) : గత వైసీపీ ప్రభుత్వ హయాంలో పల్నాడులో కళంకిత సీఐల సస్పెన్షన్ వ్యవహారం పోలీసు వర్గాల్లో సంచలనం సృష్టించింది. గత వైసీపీ హయాంలో జరిగిన టీడీపీ నేతల హత్యల్లో అత్యధిక ఘటనల్లో ప్రత్యక్షంగానో లేదంటే పరోక్షంగానో పోలీసుల ప్రమేయం ఉందనేది బహిరంగ రహస్యమే. నాడు టీడీపీ నేత జల్లయ్యను వైసీపీ గూండాలు దారుణంగా మతమార్చిన కేసులో పోలీసులు వ్యవహరించిన తీరు పట్ల సర్వత్రా విస్మయం వ్యక్తమవుతోంది. ఈ కేసు విచారణను తారుమారు చేసిన ఇరువురు సీఐలు షమీవుల్లా, జయకుమార్‌లను సస్పెండ్ చేసిన విషయం తెలిసిందే.... 2022 జూన్ 3న దుర్గి మండలం జంగమహేశ్వరపాడుకు చెందిన టీడీపీ నేత జల్లయ్యను వైసీపీ గుండాలు దారుణంగా హత్య చేశాయి. ఈ కేసులో పోలీసులు నిందితులను వదిలేయడమే కాకుండా అతడి బంధువులనే నిందితులుగా పేర్కొంటూ కేసు నమోదు చేశారు. పల్నాడులో గత వైసీపీ ప్రభుత్వం హయాంలో జరిగిన అరాచకాలు, హత్యలపై ఆంధ్రజ్యోతి వరుసగా ప్రచురించిన కథనాలపై ప్రభుత్వం స్పందించింది. దీనిపై కూటమి ప్రభుత్వం విచారణకు ఆదేశించింది. విచారణలో అప్పటి మాచర్ల రూరల్ సీఐ షమీముల్లా, కారంపూడి సీఐ జయ కుమార్‌లు కరుడుగట్టిన వైసీపీ ఫ్యాక్షనిస్టుల మాదిరిగా వ్యవహరించి కేసు విచారణనే తారుమారు చేసినట్లు విచారణలో తేలింది. దీంతో వారిరువురిని సస్పెండ్ చేస్తూ ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేశారు. ప్రస్తుతం షమీవుల్లా ఒంగోలు డీటీసీలో, జయకుమార్ బాపట్ల ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్‌ఎస్)లో విధులు నిర్వహిస్తున్నారు. అంతేగాక ఈ కేసులో అప్పటి గురజాల డీఎస్పీ జయరామ్ ప్రసాద్, పల్నాడు ఎస్పీ రవిశంకర్‌రెడ్డిలపై కూడా చర్యలు తీసుకునే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఏకంగా హత్య కేసులో నిందితులను తప్పించడమే కాకుండా హతుని బంధువులనే నిందితులుగా పెట్టారంటే సంబంధిత ఉన్నతాధికారులకు తెలియకుండా జరిగే అవకాశమే ఉండదనే వాదన పోలీస్ వర్గాల నుంచే వినిపిస్తోంది.

హత్య కేసులో నిందితులు సాక్షులుగా... సాక్షులు నిందితులుగా

సినిమాల్లో కూడా చూడని, ఊహకందని రీతిలో పల్నాడులో పోలీసులు పట్టపగలు జరిగిన దారుణ హత్య కేసులో నిందితులను సాక్షులుగా, సాక్షులను నిందితులుగా పేర్కొంటూ కేసు నమోదు చేసి పోలీసులు ఏ స్థాయికి దిగజారి ప్రవర్తించారో అర్థం చేసుకోవచ్చు. చంద్రయ్య తరహాలోనే పల్నాడులో జరిగిన జల్లయ్య హత్య కూడా సంచలనం సృష్టించింది. చంద్రయ్య హత్య జరిగిన ఆరు నెలలకు అంటే 2022 జూన్ 3న జంగమహేశ్వరపాడుకు చెందిన టీడీపీ నేత జల్లయ్యను వైసీపీ గుండాలు దారుణంగా హతమార్చారు. దీనిలో భాగంగానే దుర్గి మండలం జంగమహేశ్వరపాడుకు చెందిన గ్రామ టీడీపీ నాయకుడు జల్లయ్య గ్రామాన్ని వదిలి గురజాల పరిధిలోని మాడుగులలో తలదాచుకుంటున్నాడు. గ్రామంలో రాజకీయ ఆధిపత్యం కోసం జల్లయ్యను హతమార్చేస్తే తమకు ఎదురుండదని వైసీపీ నాయకులు భావించారు. అప్పటి మాచర్ల ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డికి ప్రధాన అనుచరుడైన జంగమహేశ్వరపాడుకు చెందిన రౌడీషీటర్ మన్నెయ్య, ఆయన సోదరులు జల్లయ్యను హతమార్చేందుకు అప్పటికే సిద్ధమయ్యారు. ఇదిలాఉంటే 2022 జూన్ 3న జల్లయ్య రావులాపురం గ్రామంలో జరుగుతున్న తన అన్న కుమార్తె వేడుకకు వస్తుండగా సమాచారం తెలుసుకున్న వైసీపీ నాయకులు, పిన్నెల్లి ప్రధాన అనుచరుడైన మన్నెయ్య నేతృత్వంలో జంగమహేశ్వరపాడు శివారు కాకిరాల అటవీ ప్రాంతంలో దారి కాచి కత్తులతో పొడిచి దారుణంగా హత మార్చారు. ఈ హత్య కూడా తీవ్ర సంచలన సృష్టించింది. అయితే ఈ హత్యకు పాల్పడిన మన్నెయ్య, మరి కొందరిపై హత్య కేసు బనాయించకపోగా జల్లయ్యతో పాటు ఉండి ఈ దాడిలో తీవ్రంగా గాయపడిన సాక్షులైన జల్లయ్య మేనమామలనే నిందితులుగా కేసు నమోదు చేశారు. ఎంత దారుణమంటే హత్య కేసులో నిందితులను తప్పించి, సాక్షులనే నిందితులుగా కేసు నమోదు చేశారు. అంతేగాక జల్లయ్యను హత్య చేసిన నిందితులనే ఈ కేసులో సాక్షులుగా పేర్కొనడం నాటి దారుణాలకు పరాకాష్టగా చెప్పవచ్చు. అంతేకాదు జల్లయ్యను హత్య చేయబోతున్నారనే విషయం పోలీసులకు కూడా ముందుగానే తెలుసనేది బహిరంగ రహస్యమే.

పిన్నెల్లి సోదరుల అండతో రెచ్చిపోయిన పోలీసులు

పల్నాడు లో జరిగిన వరుస హత్యలకు నాటి మాచర్ల ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి, ఆయన సోదరుడు వెంకటరామిరెడ్డిల పరోక్ష పాత్ర ఉన్నట్లు పెద్ద ఎత్తున ఆరోపణలు వెల్లువెత్తాయి. పల్నాడు ప్రాంతంలో పిన్నెల్లి సోదరులు గడిచిన ఐదేళ్ల అరాచకాలకు తెగబడ్డారు. తెలుగుదేశం పార్టీ కార్యకర్తలతో పాటు సామాన్య ప్రజానీకాన్ని సైతం భయభ్రాంతులకు గురి చేశారు. ఈ క్రమంలో అప్పట్లో జరిగిన హత్యలతో పాటు హత్యాయత్నాలు దాడులు, లూటీలపై కేసులు కూడా నమోదు కాలేదు. సంచలనం సృష్టించిన ఘటనలపై కేసులు నమోదైనప్పటికీ ఎటువంటి దర్యాప్తు జరగలేదు. చంద్రయ్య, జల్లయ్య లాంటి సంచలనం సృష్టించిన హత్య కేసుల్లోనూ విచారణ తూతూ మంత్రంగా సాగింది. ఈ నేపథ్యంలో నాటి చంద్రయ్య హత్యను పునర్విచారణ జరిపించాలంటూ కూటమి ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు ఇప్పటికే ఈ కేసును సీఐడీకి అప్పగించింది. జల్లయ హత్యతోపాటు పల్నాడు ప్రాంతంలో జరిగిన అనేక హత్యలు, హత్యాయత్నాలు లూటీలు, దాడులకు సంబంధించిన ఘటనలపై కూడా ప్రభుత్వం సిట్ ఏర్పాటు చేసి న్యాయ విచారణ జరిపించాలని పల్నాడు ప్రాంత ప్రజలు కోరుతున్నారు.



టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడుకు డీడీని అందజేస్తున్న మన్నెం శ్రీనివాసరావు, కుటుంబ సభ్యులు

టీటీడీ ట్రస్టుకు రూ.20 లక్షల విరాళం

మంగళగిరి సిటీ, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): మంగళగిరికి చెందిన మన్నెం శ్రీనివాసరావు, అరుణ దంపతులు తిరుమల తిరుపతి దేవస్థానం ట్రస్టుకు రూ.20 లక్షల విరాళం అందించారు. ఈ మేరకు సోమవారం టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడును కలిసి విరాళం డీడీలను అందజేశారు. వారి కుమార్తెలు మన్నెం హారిక పేరిట ఎస్వీ అన్నప్రసాదం ట్రస్టుకు రూ.10 లక్షల 116లు, మన్నెం హరిత పేరిట ఎస్వీ ప్రాణదాన ట్రస్టుకు రూ.10లక్షల116లు విరాళమిచ్చారు. ఈ కార్యక్రమంలో టీటీడీ బోర్డు సభ్యురాలు తమ్మిశెట్టి జానకీదేవి, మన్నెం కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.



ప్రజా సంక్షేమం కోసం నిరంతరం శ్రమించిన డాక్టర్ కోడెల

● సత్తెనపల్లి, నరసరావుపేట నియోజకవర్గాల అభివృద్ధికి కృషి
● నేడు 6వ వర్ధంతి కార్యక్రమాల నిర్వహణకు ఏర్పాట్లు

సత్తెనపల్లి, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర శాసన సభ స్పీకర్‌గా పని చేసిన డాక్టర్ కోడెల శివ ప్రసాదరావు సత్తెనపల్లి, నరసరావుపేట నియోజక వర్గాల్లో ప్రజా సంక్షేమం కోసం ఎనలేని కృషి చేశారు. రాజకీయాల్లో తనదైన ముద్ర వేసుకున్నారు. నకరికల్లు మండలం కండ్లకుంటలో 1947 మే 2న కోడెల శివప్రసాదరావు జన్మించారు. వైద్యుడిగా, రాజకీయ నాయకుడిగా పల్నాడు ప్రాంతంలో.. పల్నాడు పులిగా ప్రజల్లో ముద్ర వేసుకున్నారు. 2014లో సత్తెనపల్లి ఎమ్మెల్యేగా గెలిచిన అనంతరం నవ్యాంధ్రప్రదేశ్ మొట్టమొదటి స్పీకర్‌గా బాధ్యతలు చేపట్టారు. సత్తెనపల్లి పట్టణంలోని రైల్వే స్టేషన్ రోడ్డులో తారకరామ సాగర్‌ను నిర్మించి ఎన్‌టీఆర్ పార్కును, వావిలాల ఘాట్‌ను నిర్మించారు. తారక రామ సాగర్‌లో 46 అడుగుల ఎన్‌టీఆర్ విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. తారక రామ సాగర్ చుట్టూ వాకింగ్ ట్రాక్ ఏర్పాటు చేశారు. సత్తెనపల్లి నియోజక వర్గంలో.. స్వచ్ఛ సత్తెనపల్లి కార్యక్రమంలో భాగంగా ఇంటింటికి మరుగు దొడ్లను నిర్మించే కార్యక్రమాన్ని విజయవంతంగా చేశారు. చేతుల శుభ్రత కార్యక్రమాన్ని నిర్వహించి యునెసెఫ్ నుంచి అవార్డు పొందారు. సత్తెనపల్లి నియోజకవర్గం విద్యాభివృద్ధిలో భాగంగా కేంద్రీయ విద్యాలయాన్ని ఏర్పాటు చేయించారు. నియోజక వర్గంలోని అన్ని మతాలకు చెందిన శ్మశాన వాటికలను అభివృద్ధి చేశారు. సత్తెనపల్లి పట్టణంలో మోడల్ పోలీసు స్టేషన్‌ను నిర్మించారు. ముస్లింల కోసం షాదీఖానాను నిర్మించి, రాష్ట్ర స్థాయి అగ్నిమాపక శిక్షణా కేంద్రాన్ని సత్తెనపల్లిలో ఏర్పాటు చేయించారు. 50 పడకల ఆస్పత్రిని వంద పడకల ఆస్పత్రిగా అభివృద్ధి చేశారు. రోగులకు వైద్య సేవలు అందేలా కృషి చేశారు. సత్తెనపల్లి పట్టణంలో రోడ్డు అభివృద్ధి చేయించి ట్రాఫిక్ అంతరాయం లేకుండా చూశారు. రైల్వే స్టేషన్ రోడ్డులో స్టేడియం అభివృద్ధికి కూడా ఎంతగానో కృషి చేశారు. 2014 నుంచి 2019 వరకు ఆంధ్రప్రదేశ్ శాసన సభ స్పీకర్‌గా సమర్థంగా సభను నడిపించారు. రాష్ట్ర విభజన అనంతరం కొత్త అసెంబ్లీని ఏర్పాటు చేయించడంలో కీలక పాత్ర పోషించారు. స్పీకర్‌గా ఉన్న సమయంలో నిత్యం గ్రామాల్లో పర్యటించి ప్రజల సమస్యలు తెలుసుకొని పరిష్కరించే వారు. సత్తెనపల్లి నియోజక వర్గ ప్రగతికి ఆయన చేసిన కృషి ఎవ్వరూ మరువ లేరు. పక్కనే నరసరావుపేట నియోజక వర్గ అభివృద్ధికి కూడా ఆయన ఎంతో కృషి చేశారు. 2018లో రాష్ట్రస్థాయి మునిసిపల్ అధికారులు నరసరావుపేటను మోడల్ టౌన్‌గా ప్రకటించారు. కోటప్పకొండ అభివృద్ధికి ఎంతగానో కృషి చేశారు. 2015లో నరసరావుపేట మునిసిపాలిటీలో వంద సంవత్సరాల వేడుకలను ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడతో కలసి నిర్వహించారు. 1983లో తెలుగుదేశం పార్టీ ద్వారా నరసరావుపేట నుంచి ఎమ్మెల్యేగా గెలిచిన డాక్టర్ కోడెల శివప్రసాదరావు 1985, 1994, 1999లో కూడా నరసరావుపేట ఎమ్మెల్యేగా విజయం సాధించారు. రాష్ట్ర హోం మంత్రిగా, పంచాయతీ రాజ్ శాఖ మంత్రిగా, రాష్ట్ర గ్రామీణాభివృద్ధి మంత్రిగా పని చేశారు. 2019 సెప్టెంబరు 16న ఆయన ఆత్మహత్య చేసుకున్నారు. కోడెల శివ ప్రసాదరావు రాజకీయ స్ఫూర్తి ఎంతో మంది రాజకీయ నాయకులకు ఆదర్శంగా నిలుస్తుంది. ప్రజా సంక్షేమం కోసం నిరంతరం పని చేసిన డాక్టర్ కోడెల శివప్రసాదరావు ఆరవ వర్ధంతి నేడు సత్తెనపల్లి, నరసరావుపేట నియోజకవర్గాల్లో పార్టీ నాయకులు, అభిమానులు భారీ ఎత్తున నిర్వహించనున్నారు.



అరవింద వారధి వద్ద కృష్ణానది ప్రవాహం

కొనసాగుతున్న వరద ప్రవాహం

● వరద నీటిలోనే తల్లిదండ్రులతో ఇళ్లకు విద్యార్థులు

కొల్లూరు, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): కృష్ణానది వరద ప్రవాహం కొనసాగుతోంది. సోమవారం కొల్లూరు మండలం అరవింద వారధి వద్ద వరద ఉధృతంగా ప్రవహిస్తోంది. గాజుల్లంక వద్ద చిన్నరేవులోకి వరద నీరు ప్రవహిస్తూ దోనేపూడి కరకట్ట దిగువన పోతార్లంక చప్టాపైకి పారుతోంది. పాఠశాలలకు వెళ్లే తమ పిల్లల కోసం లంక గ్రామాల్లోని తల్లిదండ్రులు దోనేపూడి వచ్చి. చప్టాపై ప్రవహిస్తున్న వరద నీటిలోనే ఇళ్లకు తీసుకెళ్తున్నారు. వరద చప్టాలపై వెళ్తున్న సమయంలో అక్కడ రాకపోకలు జరగకుండా రెవెన్యూ, పోలీసు సిబ్బంది చర్యలు తీసుకోవాల్సి ఉంది. కానీ, అక్కడ ఎవరూ కానరావడం లేదు. కృష్ణానది ఎగువ పరివాహక ప్రాంతంలో కురిసిన వర్షాలు, పులిచింతలతో పాటు వాగులు, వంకలు ద్వారా 3.20 లక్షల క్యూసెక్కుల వరద నీరు ప్రకాశం బ్యారేజీకి చేరుతోంది. 3.97 లక్షల క్యూసెక్కుల వరద నీరు బ్యారేజీ నుంచి విడుదలైతే మొదటి ప్రమాద హెచ్చరిక, 5.67 లక్షలు క్యూసెక్కులు విడుదల చేస్తే రెండవ ప్రమాద హెచ్చరిక అధికారులు జారీ చేస్తారు. ప్రస్తుతం వరద ప్రవాహం నిలకడగా ఉందని మొదటి ప్రమాద హెచ్చరిక కూడా జారీ చేసే అవసరం లేదని తహసీల్దార్ బి.వెంకటేశ్వర్లు తెలిపారు.



వరద నీటిలో పాఠశాల నుంచి పిల్లలను ఇంటికి తీసుకెళ్తున్న తల్లిదండ్రులు

గుంటూరులో జాతీయ మీడియా ప్రతినిధులు

● రాష్ట్రంలో మూడు రోజుల పర్యటన ప్రారంభం
● వెంగళాయపాలెం, మిర్చి యార్డుల సందర్శన



చింతలపూడిలో పర్యటిస్తున్న జాతీయ మీడియా బృంద సభ్యులు

గుంటూరు, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్ర పంచాయతీ రాజ్ మంత్రిత్వ శాఖల సహకారంతో రాష్ట్రంలో మూడు రోజుల జాతీయ మీడియా పర్యటనను సోమవారం ప్రారంభమైంది. ఈ పర్యటన ప్రముఖ జాతీయ, ప్రాంతీయ మీడియా నిపుణులను ఒక చోట చేర్చి, వినూత్నమైన అట్టడుగు స్థాయి పాలనా కార్యక్రమాల అమలును పరిశీలించి.. నివేదించడానికి వీలు కల్పిస్తుంది. మీడియా ప్రతినిధి బృందానికి పత్రికా సమాచార కార్యాలయం (పంచాయతీ రాజ్) డీడీ అదితి అగర్వాల్ నేతృత్వం వహిస్తున్నారు.

వెంగళాయపాలెంలో స్వచ్ఛ రథం పైలట్ ప్రాజెక్ట్ సందర్శన

తొలి రోజున మొదటిగా గుంటూరు గ్రామీణ మండలంలో ఉన్న వెంగళాయపాలెం గ్రామ పంచాయతీలోని స్వచ్ఛ రథం పైలట్ ప్రాజెక్ట్ అమలును జర్నలిస్టులు పరిశీలించారు. రాష్ట్ర పంచాయతీ రాజ్ శాఖ ప్రారంభించిన స్వచ్ఛ రథం అనేది ఒక మొబైల్ యూనిట్ గృహాల నుంచి ఉత్పన్నమయ్యే స్క్రాప్, వ్యర్థ పదార్థాలను మార్పిడి చేసుకుని, సమాన బరువు కలిగిన రోజువారి నిత్యావసరాలను అందిస్తుంది. గ్రామ స్థాయిలో వ్యర్థాల విభజనను ప్రోత్సహించి స్థిరమైన పారిశుధ్యాన్ని ప్రోత్సహించడమే ఈ చొరవ లక్ష్యం. దీని గురించి అన్ని వివరాలు అడిగి తెలుసుకొన్నారు.

ఆసియాలోనే అతిపెద్ద మిర్చి యార్డ్ సందర్శన

మీడియా బృందం గుంటూరులోని ఆసియాలోనే అతిపెద్ద మిర్చి మార్కెటింగ్ యార్డ్‌ను సందర్శించింది. అక్కడ వారు మిర్చి యార్డ్ కార్యదర్శి చంద్రికతో సంభాషించి, క్షేత్రస్థాయి వాణిజ్య, మార్కెటింగ్ కార్యకలాపాలతో పాటుగా గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు దోహదపడుతుందో తెలుసుకున్నారు. మిర్చి వేలం ఎలా జరుగుతుంది, ఈనామ్ అమలు తదితర విషయాలను అడిగి తెలుసుకొన్నారు. మధ్యాహ్నం, మీడియా బృందం చింతలపూడి గ్రామ పంచాయతీకి చేరుకుని అక్కడ స్వామిత్వ పథకం అమలు గురించి తెలుసుకున్నారు. ఈ చొరవ గ్రామీణ నివాసితులకు చట్టబద్ధమైన ఆస్తి హక్కులను అందిస్తుంది, వారు సంస్థాగత రుణాన్ని పొందటానికి, భూమిని మానిటైజ్ చేయడానికి, వివాదాలను తగ్గించడానికి వీలు కల్పిస్తుంది. ఈ పథకం వారి ఆర్థిక స్థిరత్వాన్ని, భూ యాజమాన్య భద్రతను ఎలా మెరుగుపరిచిందో లబ్ధిదారులు తెలుపుతూ ప్రభుత్వానికి వారి కృతజ్ఞతను వ్యక్తం చేశారు. ఈ సందర్శనలో పంచాయతీరాజ్ మంత్రిత్వ శాఖ తాజా ఏఐ-ఆధారిత సాధనమైన సభాసార్‌ను గ్రామసభలో ప్రత్యక్ష ప్రదర్శన ద్వారా వివరణ పొందారు. ఈ పర్యటనలో పంచాయతీ రాజ్ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ తోట చందన, అధికారులు, సిబ్బంది, స్థానిక కమ్యూనిటీ నాయకులు ఈ పర్యటనలో పాల్గొన్నారు.

పల్నాడు వార్తలు

◆ నరసరావుపేట ◆ వినుకొండ ◆ చిలకలూరిపేట

అంతర్ జిల్లా పోటీల్లో చరితరెడ్డి డిఫెన్స్ అకాడమీ విద్యార్థుల ప్రతిభ

నరసరావుపేట రూరల్, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): అంతర్‌జిల్లా చాంపియన్ షిప్ పోటీలలో చరితరెడ్డి డిఫెన్స్ స్పోర్ట్స్ అకాడమీకి చెందిన క్రీడాకారులు ఉత్తమ ప్రతిభ కనబర్చినట్లు అకాడమీ డైరెక్టర్ ఇందూరి వెంకటేశ్వరరెడ్డి తెలిపారు. ఈ నెల 14వ తేదీన కర్నూలు జిల్లాలో జరిగిన 17వ ఆంధ్రప్రదేశ్ అంతర్‌జిల్లాల చాంపియన్ షిప్ పోటీలలో గుంటూరు జిల్లా బాలికల అండర్-12 విభాగంలో ద్వితీయ స్థానంలో నిలిచినట్లు తెలిపారు. ఈ సందర్భంగా క్రీడాకారులను కోచ్ వై.వేళాంగినిరెడ్డి, పి.శ్రీనివాసరెడ్డి, డి.యోహాన్, అభినందించారు.



స్మార్ట్ రేషన్ కార్డులను అందజేస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు

స్మార్ట్ కార్డుల పంపిణీ

నరాసరావుపేట రూరల్, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): క్యూఆర్ కోడ్‌తో ఉన్న స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమం సోమవారం నరసరావుపేటలో జరిగింది. 24వ వార్డులో సోమవారం స్మార్ట్‌కార్డుల పంపిణీ కార్యక్రమం ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు ప్రారంభించారు. సభ అనంతరం ఆయన ఇంటింటి తిరిగి కార్డులను అందజేశారు. కార్యక్రమంలో జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి ప్రసాద్, ఆర్డీవో, ఉమ్మడి కూటమి నాయకులు పాల్గొన్నారు.

క్లుప్తంగా...

రొంపిచర్ల, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వీరవట్నం వెళ్లే ఓవర్ బ్రిడ్జి వద్ద ఆటోను లారీ ఢీకొన్న సంఘటనలో గోగులపాడు గ్రామానికి చెందిన కూలీలకు గాయాలయ్యాయి. వీరిని అంబులెన్స్‌లో నరసరావుపేట ప్రభుత్వ వైద్యశాలకు చికిత్స నిమిత్తం తరలించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ మణికృష్ణ తెలిపారు.

● వినుకొండ: పాఠశాల విద్యాశాఖ ఆధ్వర్యంలో ఉమ్మడి గుంటూరు జిల్లా పరిధిలో జిల్లా విద్యా శిక్షణ సంస్థ బోయపాలెంలో నిర్వహించిన కళా ఉత్సవ్ - 2025 పోటీల్లో స్థానిక జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాల విద్యార్థులు ప్రతిభ చాటారు. సోమవారం పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో హెచ్ఎం బి.శైలజ, ఉపాధ్యాయులు అభినందించారు.

● వినుకొండ టౌన్: హనుమాన్ నగర్‌లో మాల మహానాడు నియోజకవర్గ కార్యాలయాన్ని జాతీయ అధ్యక్షుడు గోళ్ళ అరుణ్ కుమార్ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ గోదా జాన్‌పాల్ ఆదివారం రాత్రి ప్రారంభించారు. ముందుగా నరసరావుపేట రోడ్డులోని అంబేడ్కర్ విగ్రహం వద్ద నుంచి హనుమాన్‌నగర్ వరకు నియోజకవర్గ మాలలతో కలిసి పెద్దఎత్తున బైక్ ర్యాలీ నిర్వహించారు.

● బొల్లాపల్లి: బొల్లాపల్లి పశు వైద్యశాలలో పశువులకు గాలి కుంటు వ్యాధి నిర్మూలన టీకాల కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. కార్యక్రమంలో డాక్టర్ పి.శ్రీనివాసమూర్తి, గోపాల నారాయణ సిబ్బంది పాల్గొన్నారు.

● బొల్లాపల్లి: మండలంలోని వెల్లటూరులోని శ్రీ వేణుగోపాల స్వామి దేవస్థాన పునఃర్నిర్మాణంలో భాగంగా కోటి రూపాయలు నిధులు విడుదలైనట్టు దేవదాయ శాఖ కార్యనిర్వాహణ అధికారి సీహెచ్ శివనాగిరెడ్డి సోమవారం తెలిపారు. సీజీఎఫ్ నిధుల నుంచి వేణుగోపాల స్వామి, సోమేశ్వర స్వామి దేవస్థాన పునఃర్నిర్మాణం కొరకు రూ 2.35 కోట్లు విడుదలైనట్టు ఆయన తెలిపారు.

● చిలకలూరిపేట: తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ చిలకలూరిపేటలోని గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులు మున్సిపల్ కమిషనర్ పి.శ్రీహరిబాబుకు సోమవారం వినతి పత్రం సమర్పించారు. తమ సమస్యలకు 15 రోజుల్లోగా పరిష్కారం చూపాలని, లేకుంటే రాష్ట్రవ్యాప్తంగా నిరసన కార్యక్రమాలు చేపడతామన్నారు.

● చిలకలూరిపేట: రాష్ట్ర ప్రభుత్వం ఆదుకోవాలని, కార్మిక శాఖ ఆధ్వర్యంలో తమకు సంక్షేమ పథకాలు అమలు అయ్యేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఆటో వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) నాయకులు ఆధ్వర్యంలో ఆటో వర్కర్లు సోమవారం చిలకలూరిపేట తహసీల్దార్ షేక్ హుస్సేన్‌కు వినతి పత్రం అందచేశారు.

● చిలకలూరిపేట: సేవా కార్యక్రమాలు చేస్తున్న ఒయాసిస్ సంస్థ నిర్వాహకులను మార్కెట్ యార్డ్ చైర్మన్ షేక్ కరిముల్లా అభినందించారు. సంస్థ ఆధ్వర్యంలో కేజే ఆసుపత్రిలో ఆదివారం జరిగిన సమావేశంలో ఆయన పాల్గొన్నారు. సంస్థ అధ్యక్షురాలు డాక్టర్ కందిమళ్ళ జయమ్మ ఆధ్వర్యంలో పేదలకు రెండు కుట్టు మిషన్లు, వైద్య ఖర్చుల నిమిత్తం రూ.పదివేలు అందజేశారు.

● చిలకలూరిపేట: ఏఎంజీ హైస్కూల్‌లో జరిగిన జిల్లా ఉమ్మడి గుంటూరు జిల్లా అండర్ 14, అండర్ 17, అండర్ 19 బాలుర, బాలికల జూడో అండ్ గట్కా జిల్లా జట్ల ఎంపికలు సోమవారం నిర్వహించారు. సువార్త, మహాభి పాల్గొని జిల్లా జట్లను ఎంపిక చేశారు.

● నాదెండ్ల: రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ గణపవరం గ్రామానికి చెందిన తల్లపల్లి అంజిబాబుకు జనసేన నేత, రాధా రంగ మిత్ర మండలి కన్వీనర్ అచ్చుకోల మురళీకృష్ణ ఆధ్వర్యంలో సోమవారం సాయం అందించారు. రాజీవ్‌గాంధీ కాలనీలోని అంజిబాబుకు ఒక నెలకు సరిపడ బియ్యం, నిత్యావసరాలు అందజేశారు.

● చిలకలూరిపేట: స్థానిక కంప్యూటర్ సంస్థ అధినేత షేక్ ఆదమ్ షఫీను ఆంధ్రప్రదేశ్ ప్రైవేట్ టీచర్స్ అసోసియేషన్ వారు పాన్ ఇండియా ఐకాన్ ఉత్తమ అధ్యాపక అవార్డుతో గుంటూరులో సోమవారం ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా పలువురు అభినందించారు.



అర్జీలు స్వీకరిస్తున్న జేసీ సూరజ్ ధనుంజయ్ గనోరే

అర్జీల సత్వర పరిష్కారమే లక్ష్యం

● జాయింట్ కలెక్టర్ సూరజ్

నరసరావుపేట టౌన్, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో అందిన సత్వర పరిష్కారమే లక్ష్యంగా చర్యలు తీసుకోవాలని జాయింట్ కలెక్టర్ సూరజ్ ధనుంజయ్ గనోరే అధికారులను అదేశించారు. సోమవారం నరసరావుపేటలోని పల్నాడు జిల్లా కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక ద్వారా జిల్లా నలుమూలలు నుంచి వచ్చిన అర్జీదారులు నుంచి అర్జీలను జాయింట్ కలెక్టర్ సూరజ్ ధనుంజయ్ గనోరే జాయింట్ కలెక్టర్‌తో పాటు జిల్లా రెవెన్యూ అధికారి అర్జీలను స్వీకరించారు. పీజీఆర్ఎస్‌లో 151 అర్జీలు అందాయి. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ సూరజ్ ధనుంజయ్ గనోరే మాట్లాడుతూ అర్జీల పరిష్కారంలో ఎటువంటి జాప్యానికి తావులేకుండా నాణ్యతో పరిష్కరించాలన్నారు. అర్జీదారుని సంతృప్తే ధ్యేయంగా అర్జీల పరిష్కారతీరు ఉండాలని స్పష్టం చేశారు. అర్జీలు రీ ఓపెన్ కాకుండా పరిష్కార చర్యలు ఉండాలన్నారు. ఫిర్యాదుదారులతో ముఖాముఖీ మాట్లాడి ఫిర్యాదుదారుల సమస్యలను తెలుసుకొని పూర్తిస్థాయిలో పరిష్కరిస్తామని భరోసా కల్పించారు. జిల్లా అధికారులు వారి శాఖలకు సంబంధించిన అర్జీలను క్షుణంగా పరిశీలించి తమ సిబ్బందితో నిర్ణీత గడువులోగా త్వరితగతిన పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలన్నారు. సమస్యలు తమ పరిధిలోనివి కానప్పుడు సంబంధిత శాఖకు పరిష్కారం కోసం పంపాలని అధికారులకు సూచించారు.

పాస్టర్లకు ఎన్‌వోసీ సర్టిఫికెట్లు అందజేయాలి

వినుకొండ టౌన్, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలోని పాస్టర్లకు ఎన్‌వోసీ సర్టిఫికెట్లను మంజూరు చేయలని పల్నాడు జిల్లా పాస్టర్స్ ఫెలోషిప్ నాయకులు జయప్రకాష్ ఆధ్వర్యంలో సోమవరం వినుకొండ తహసీల్దార్ సురేష్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో జిల్లా వైస్ ప్రెసిడెంట్ రెవ ఎ. యెహోషువ, జిల్లా అడ్వైజర్ వి.రాంబాబు, జిల్లా సలహాదారులు సంపెంగల ప్రేమయ్య, నియోజకవర్గం పెద్దలు నంబుల వెంకటేశ్వర్లు, నాయకులు పి.ప్రభాకర్, బి.జక్రయ్య తదితరులు పాల్గొన్నారు.

సురవరం సుధాకరెడ్డికి ఘన నివాళి



సుధాకరరెడ్డి చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న ఎమ్మెల్యే అరవిందబాబు, గోనుగుంట్ల, సీపీఐ నాయకుడు ముప్పాళ్ళ నాగేశ్వరరావు తదితరులు

నరసరావుపేట టౌన్, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): మాజీ పార్లమెంట్ సభ్యుడు, మాజీ సీపీఐ జాతీయ ప్రధాన కార్యదర్శి సురవరం సుధాకరరెడ్డి ఆశయ సాధనకు పునరంకితం కావాలని పలువురు నాయకులు అన్నారు. సోమవారం పల్నాడు జిల్లా కేంద్రం నరసరావుపేటలోని వెంకటేశ్వర కల్యాణ మండపంలో సురవరం సుధాకరరెడ్డి సంస్మరణ సభ నిర్వహించారు. ఈ సభకు సీపీఐ జిల్లా కార్యదర్శి ఏ మారుతీ వరప్రసాద్ అధ్యక్షత వహించారు. జిల్లావ్యాప్తంగా వివిధ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు హాజరై సురవరం సుధకారరెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్ళు అర్పించారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ సురవరం సుధాకరరెడ్డి వామపక్ష ఐక్యత కోసం పరితపిస్తూ వామపక్ష ఉద్యమాన్ని నిర్మించారన్నారు. ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద బాబు, సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ళ నాగేశ్వరరావు, టీడీపీ పల్నాడు జిల్లా అధ్యక్షుడు కొమ్మాలపాటి శ్రీధర్, సీపీఎం జిల్లా కార్యదర్శి గుంటూరు విజయకుమార్, సీపీఐ రాష్ట్ర నాయకుడు వై చెంచయ్య, ప్రజా నాట్యమండలి రాష్ట్ర నాయకుడు ఆర్.పిచ్చయ్య, పల్నాడు జిల్లా ప్రధాన కార్యదర్శి బైరాపట్నం రామకృష్ణ, రాష్ట్ర గ్రంథాయల పరిషత్ చైర్మన్ గోనుగుంట్ల కోటేశ్వరరావు, సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి కాసా రాంబాబు, షేక్ హుస్సేన్, ఏపీ మహిళా సమాఖ్య జిల్లా కార్యదర్శి చెరుకుపల్లి నిర్మల, ఏఐవైఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నాసన్‌జీ, వి.వరదయ్య, ఏఐఎఎఫ్ ఎం.సుబ్బారావు, సి.సైదా, ఎస్టీయూ జోసఫ్ సుధీర్, బీజేపీ ఆర్.రామకృష్ణ, డాక్టర్ కె.వెంకటేశ్వర్లు, నవతరం పార్టీ రావు సుబ్రహ్మణ్యం, జనసేన జీవీఎస్ ప్రసాద్, ఎంసీపీఐ సైదా, పీడీఎం నల్లపాటి రామారావు, కేఎన్‌పీఎస్ కే కృష్ణ నివాళి అర్పించారు.




విజేతలకు బహుమతులు అందజేస్తున్న ఎంపీ, ఎమ్మెల్యే, గ్రంథాయల చైర్మన్, కళాశాల యాజమాన్యం తదితరులు

సాంకేతికాభివృద్ధికి ఇన్నోవేషన్ ఫౌండేషన్లు కీలకం

ఈశ్వర్‌లో జరిగిన ఇంజనీర్స్ డేలో ఎంపీ శ్రీకృష్ణదేవరాయలు

నరసరావుపేట టౌన్, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): దేశం సాంకేతిక రంగంలో ముందంజలో ఉండటానికి ఇన్నోవేషన్ ఫౌండేషన్లే కీలకం అని ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు అన్నారు. సోమవారం ఇంజనీర్స్ డే సందర్భంగా ఈశ్వర్ ఇంజనీరింగ్ కళాశాలలో ఈశ్వర్ ఇన్నోవేషన్ గెలాక్సీ ఫౌండేషన్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు మాట్లాడుతూ ఈశ్వర్ కళాశాల విద్యార్థులు చూపిస్తున్న ప్రతిభ దేశ అభివృద్ధికి దోహదం చేస్తుందన్నారు. ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు, రాష్ట్ర గ్రంథాలయ పరిషత్ చైర్మన్ గోనుగుంట్ల కోటేశ్వరరావు, ఇన్‌వీటిజ్ సీఈవో, ఐటీఏఏపీ అధ్యక్షుడు ఇంద్రజీల్, హైదరాబాద్ టీఎంఐ సీనియర్ ప్రాజెక్టు మేనేజర్ షేక్ ఇమ్రాన్, బైట్ ఎక్స్‌ఎల్ సహ వ్యవస్థాపకుడు చరణ్‌లు మాట్లాడుతూ విద్యార్థులు స్టార్టప్‌ల వైపు దృష్టి పెట్టాలన్నారు. విద్యార్థులు రూపొందించిన ప్రాజెక్టు ఎక్స్‌పో ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో కళాశాల చైర్మన్ షేక్ మీరావలి, సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ షేక్ కరీమ్ మొహిద్దీన్, ఎండీ షేక్ మస్తాన్ షరీఫ్, ఎగ్జిక్యూటీవ్ డైరెక్టర్ షేక్ నజీమా, టీపీవో డాక్టర్ షేక్ ముజీర్, విజ్ఞాన్ టీటీఐ మేనేజర్ షేక్ అబ్దుల్ విద్యార్థులు, అధ్యాపకులు, పాల్గొన్నారు.

ఏఎంరెడ్డి కళాశాలలో ఘనంగా ఇంజనీర్స్ డే



కేక్ కట్ చేస్తున్న ఏఎంరెడ్డి ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్, అధ్యాపకులు, తదితరులు

నరసరావుపేట టౌన్, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఏఎంరెడ్డి ఇంజనీరింగ్ కళాశాలలో ఇంజనీర్స్ డే వేడుకలు సోమవారం ఘనంగా నిర్వహించారు. కళాశాల ప్రాంగణంలో ఉన్న మోక్షగుండం విశ్వేశ్వరయ్య విగ్రహానికి పాలాభిషేకం చేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా కళాశాల కార్యదర్శి అట్లూరి శాంతి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ భారతదేశపు తొలి సివిల్ ఇంజనీర్ మోక్షగుండం విశ్వేశ్వరయ్య జయంతి సెప్టెంబరు 15న జాతీయ ఇంజనీర్ల దినోత్సవంగా జరుపుకుంటామన్నారు. కార్యక్రమంలో ఇంజనీరింగ్ ప్రిన్సిపాల్ డాక్టర్ సీహెచ్ మల్లికార్జున, డిప్లొమా ప్రిన్సిపాల్ డాక్టర్ కే కృష్ణారెడ్డి, అధ్యాపకులు పాల్గొన్నారు.

ఎన్ఈసీలో...



మోక్షగుండం విశ్వేశ్వరయ్య విగ్రహానికి నివాళులు అర్పిస్తున్న కళాశాల చైర్మన్ మిట్టపల్లి వెంకట కోటేశ్వరరావు

నరసరావుపేట రూరల్, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): స్థానిక నరసరావుపేట ఇంజనీరింగ్ కళాశాలలో సోమవారం ఇంజనీరింగ్‌డే వేడుకలు ఘనంగా నిర్వహించారు. కళాశాల ఆవరణలోని ఇంజనీరింగ్ పితామహుడు భారతరత్న మోక్షగుండం విశ్వేశ్వరయ్య విగ్రహానికి కళాశాల చైర్మన్ మిట్టపల్లి కోటేశ్వరరావు, కళాశాల సెక్రటరీ మిట్టపల్లి రమేష్‌బాబు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ డైరెక్టర్ డిజివో రామ బాలాజిరెడ్డి, డాక్టర్ పి.నాగసౌజన్య, కళాశాల ప్రిన్సిపాల్ ఎస్.వెంకటేశ్వర్లు, వైస్ ప్రిన్సిపాల్ డి.సునీల్, తదితరులు పాల్గొన్నారు.



గోడపత్రిక ఆవిష్కరిస్తున్న జేసీ సూరజ్ తదితరులు

గోడ పత్రికలు ఆవిష్కరించిన జేసీ

నరసరావుపేట లీగల్, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): వివిధ అంశాలకు సంబంధించి పల్నాడు జిల్లా జేసీ సూరజ్ సోమవారం గోడపత్రిక ఆవిష్కరించారు. ఈ నెల 17వ తేదీ నుంచి అక్టోబర్ రెండో తేదీ వరకు జరగనున్న స్వస్థనారి, సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమానికి సంబంధించి గోడపత్రికలు ఆవిష్కరించారు. కార్యక్రమంలో డీఎంహెచ్‌వో డాక్టర్ రవి వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఎన్నో ప్రాజెక్టులకు రూపకర్త మోక్షగుండం: ఎంపీ లావు



ఎంపీని సత్కరిస్తున్న అసోసియేషన్ సభ్యులు

నరసరావుపేట రూరల్, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): భారతదేశంలో ఎన్నో ప్రాజెక్టులకు రూపకర్త భారతరత్న మోక్షగుండం విశేశ్వరయ్య అని ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు తెలిపారు. నరసరావుపేట పట్టణంలోని ఇండియన్ మెడికల్ అసోసియేషన్ బిల్డింగ్‌లో సోమవారం నరసరావుపేట ఇంజినీర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో భారతరత్న మోక్షగుండం విశ్వేశ్వరయ్య జయంతి సభ ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీతోపాటు, ఎమ్మెల్యే చదలవాడ అరవిందబాబు పాల్గొని విశ్వేశ్వరయ్య చిత్రపటానికి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో పల్నాడు డెవలప్ మెంట్ అధికారులు గోరంట్ల సాంబశివరావు సుబ్బారెడ్డి, నరసరావుపేట మున్సిపల్ కమిషనర్ మేడికొండ జశ్వంతరావు, నరసరావుపేట ఇంజినీర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు రాయిడి బ్రహ్మయ్య, అసోసియేషన్ చైర్మన్ బొందిలి శ్రీనివాస్‌సింగ్, సెక్రటరీ లక్ష్మీకాంత్, కోశాధికారి గంజి అనిల్, సీనియర్ ఇంజినీర్స్ కొమ్మసాని కమలాకర్ రెడ్డి, ఉన్నం వేణుగోపాల్, జీపీ రంగయ్య తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఉన్నం వేణు గోపాల్‌ను ఘనంగా సన్మానించారు.

రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలకు కృష్ణవేణి డిగ్రీ విద్యార్థుల ఎంపిక



పోటీలకు ఎంపికైన విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ నాతాని వెంకటేశ్వర్లు తదితరులు

నరసరావుపేట టౌన్, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): కృష్ణవేణి డిగ్రీ కళాశాల విద్యార్థులు రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు ఎంపిక య్యారని ప్రిన్సిపాల్ నాతాని వెంకటేశ్వర్లు సోమవారం తెలిపారు. సత్తెనపల్లిలో ఈ నెల 14న జిల్లా కబడ్డీ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగిన అండర్ 20 పురుషుల, మహిళల పోటీలలో ఈ ఘనత సాధించారన్నారు. ఎం.కావేరి, జే.విజయలక్ష్మీదేవి, బీడీ కృష్ణశ్రీలు ప్రతిభ చాటి జట్టుకు ఎంపికయ్యారన్నారు. ఎంపికైన విద్యార్థులు ఈ నెల 22, 23, 24 తేదీలలో విజయవాడ ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో జరిగే రాష్ట్రస్థాయి పోటీలలో పాల్గొంటారన్నారు. ఎంపికైన విద్యార్థులను వైస్ ప్రిన్సిపాల్ ఎంఆర్‌కే సతీస్‌బాబు, పీడీ ఈదర ఆదిబాబు అభినందించారు.


జిల్లా స్థాయి కబడ్డీ పోటీల్లో వాగ్దేవి విద్యార్థుల ప్రతిభ



ప్రతిభ చూపిన విద్యార్థులతో సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ రాయల శ్రీనివాసరావు, డైరెక్టర్లు

నరసరావుపేట టౌన్, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): సత్తెనపల్లిలో ఈ నెల 14న జరిగిన కబడ్డీ పోటీలలో వాగ్దేవి జూనియర్ కళాశాల విద్యార్థులు ప్రతిభ చాటారని ప్రిన్సిపాల్ ఓగూరి నాగేశ్వరరావు సోమవారం తెలిపారు. పసుపులేటి తిరుపతమ్మ, కొత్తా లక్ష్మీసరిత, పిన్నెబోయిన స్రవంతి ఎంపికయ్యారని, ఈ నెల 22, 23, 24 తేదీలలో విజయవాడలో జరిగే రాష్ట్రస్థాయి పోటీలలో పాల్గొంటారని చెప్పారు. ప్రతిభ చాటిన విద్యార్థులను కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ రాయల శ్రీనివాసరావు, డైరెక్టర్లు కాట్ల రామకోటేశ్వరరావు, కపిలవాయి రాజేంద్రప్రసాద్, పాశం కృష్ణారావు, పీవీ అచ్యుతరావు, పీడీ రాయల ఆంజనేయలు అభినందించారు.

పీజీఆర్ఎస్‌కు 127 ఫిర్యాదులు




ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరిస్తున్న ఎస్పీ బి.కృష్ణారావు

నరసరావుపేట లీగల్, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): పల్నాడు జిల్లా పోలీస్ కార్యాలయంలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్)ను నిర్వహించారు. ఎస్పీ బి.కృష్ణారావు కార్యక్రమంలో పాల్గొని ప్రజల వద్ద నుంచి 127 ఫిర్యాదులను స్వీకరించారు. కార్యక్రమంలో మహిళా పోలీస్‌స్టేషన్ డీఎస్పీ ఎం.వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

ఎస్పీని కలిసిన ఎమ్మెల్యే అరవిందబాబు

నరసరావుపేట రూరల్, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): నరసరావుపేట ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు సోమవారం పల్నాడు జిల్లా ఎస్పీ కృష్ణారావును కలిశారు. నరసరావుపేట, రూరల్ పరిధిలో శాంతిభద్రతలకు విఘాతం కలిగించే అసాంఘిక శక్తులను అదుపు చేయాలని ఎస్పీని కోరారు.

తిరుమల ఇంజనీరింగ్ కళాశాలలో ఘనంగా ఇంజనీర్స్‌డే



తిరుమల ఇంజనీరింగ్ కళాశాలలో వేడుకలను ప్రారంభిస్తున్న కళాశాల ప్రిన్సిపాల్ వైవీ నారాయణ

నరసరావుపేట రూరల్, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): స్థానిక తిరుమల ఇంజనీరింగ్ కళాశాలలో ఇంజనీర్‌డే వేడుకలు సోమవారం ఘనంగా నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వైవీ నారాయణ కేక్ కట్‌చేసి వేడుకలు ప్రారంభించారు. కార్యక్రమంలో కళాశాల సెక్రటరీ, కరస్పాండెంట్ రావెల సత్యనారాయణ, అన్ని విభాగాల అధిపతులు, టీచింగ్, నాన్ టీచింగ్ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.



బాలికలను అభినందిస్తున్న చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు

జాతీయ పోటీలకు ఎంపికైన బాలికలకు జీవీ అభినందన

శావల్యాపురం, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి గుంటూరు జిల్లా జట్టు తరఫున పాల్గొని జట్టును ప్రథమస్థానంలో నిలిపిన శావల్యాపురం జడ్పీ పాఠశాల పూర్వ విద్యార్థినులను చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు వినుకొండలోని తన కార్యాలయంలో సోమవారం అభినందించారు. సత్యసాయి జిల్లా రామాపురంలో ఈ నెల 12 నుంచి 14వరకు జరిగిన ఆంధ్రప్రదేశ్ 10వ జూనియర్ బాలబాలికల బాల్ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్ టోర్నమెంట్ జరిగింది. శావల్యాపురంకు చెందిన ఏడుగురు పూర్వవిద్యార్థినులు జట్టు తరఫున పాల్గొనగా వారిలో శావల్యాపురానికి చెందిన కామినేని కావ్య, శానంపూడికి చెందిన ఆకుమల్ల సమీర ప్రతిభచూపి స్టార్ ఆఫ్ ఆంధ్ర అవార్డు గెలుచుకున్నారు. అక్టోబరులో తమిళనాడులో జరగనున్న జాతీయస్థాయి పోటీల్లో కావ్య, సమీర ఆంధ్రప్రదేశ్ జట్టు తరఫున ఆడనున్నారు. బాలికలకు విన్నర్స్ కప్, ప్రశంసాపత్రాలు అందజేసి జీవీ అభినందించారు. పీడీ రాధాకృష్ణమూర్తి, పీఈటీ ఝాన్సీ, బాల్ బ్యాడ్మింటన్ అసోషియేషన్ జాయింట్ సెక్రటరీ జోనానాయక్, జిల్లా సెక్రటరీ శ్రీనివాసరావు, శివశంకర్ పాల్గొన్నారు.

నేడు కోడెల శివప్రసాద్ విగ్రహావిష్కరణ

వినుకొండ టౌన్, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఎన్ఎస్‌పీ కాలనీ సమీపంలోని నరసరావుపేట రోడ్డులో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర తొలి శాసనసభాపతి డాక్టర్ కోడెల శివప్రసాద్ విగ్రహావిష్కరణ కార్యక్రమానికి టీడీపీ నాయకులు సర్వం సిద్ధం చేశారు. ఇప్పటికే రోడ్డుపై వెళ్లే ప్రయాణీకులకు ఎటువంటి ఆటంకం లేకుండా ప్రధాన రహదారికి ఇరువైపులా 10 అడుగుల మేరకు రోడ్డు వెడల్పు చేసి, చెట్టు కొమ్మలను తొలగించారు. విగ్రహం సమీపంలోని ఎన్ఎస్‌పీ కాలనీ ఆవరణలో భారీ బహిరంగ సభ ఏర్పాటు చేసేందుకు పార్టీ నాయకులు, కార్యకర్తలు సభవేదికను ఏర్పాటు చేశారు. కార్యక్రమానికి స్పీకర్ అయ్యన్నపాత్రుడు, విద్యుత్‌శాఖ మంత్రి గొట్టిపాటి రవి, ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ జవహర్, పార్లమెంటు సభ్యుడు శ్రీకృష్ణదేవరాయలు, పల్నాడు జిల్లా టీడీపీ అధ్యక్షుడు కొమ్మాలపాటి శ్రీధర్ రానున్నట్లు చీఫ్‌విప్ జీవీ అంజనేయులు తెలిపారు. నియోజకవర్గంలోని టీడీపీ అనుబంధ సంఘాలు, నాయకులు, కార్యకర్తలు, పెద్దసంఖ్యలో పాల్గొనాలని కోరారు.

రేపు స్త్రీశక్తి కార్యక్రమం

ఈ నెల 17న నరసరావుపేట రోడ్డులోని గంగినేని కల్యాణ మండపంలో స్త్రీశక్తి కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు సోమవారం తెలిపారు. స్త్రీశక్తి కార్యక్రమంలో భాగంగా మహిళలకు వైద్యశిబిరం ఏర్పాటు చేశామని, 80 రకాల ఉచిత పరీక్షలతో పాటు ఉచితంగా మందులు పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని నియోజకవర్గంలోని మహిళలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

మానవుడే మహనీయుడు పుస్తకావిష్కరణ

వేల్పూరు (శావల్యాపురం) సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): మానవుడే మహనీయుడు అనే పుస్తకాన్ని జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో ఈ నెల 14న విజయనగరంలో జరిగిన రాష్ట్ర మహాసభల్లో ఆవిష్కరించారు. శావల్యాపురం మండలం వేల్పూరుకు చెందిన జేవీవీ జిల్లా ప్రధాన కార్యదర్శి సంద్రపాటి చలపతి రావు రచించిన ఈ పుస్తకాన్ని గేయానంద్, మాజీ ఎమ్మెల్సీలు లక్ష్మణరావు, బాలసుబ్రమణ్యం, ప్రొఫెసర్ నాగేశ్వరరావు, రామచంద్రయ్యలు ఆవిష్కరించారు.